www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 5-5-2024
Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి

9 కేంద్రాల్లో నేడు నీట్

పరీక్ష రాయనున్న 4,692 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 4: దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ (ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంసెస్) కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు 4,692 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. తిరుపతి పరిధిలోని తొమ్మిది (విశ్వం హైస్కూల్, ఎడిఫై స్కూల్, శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్, గీతమ్ స్కూల్, లిటిల్ ఏంజెల్స్ పాఠశాల, శ్లోక ఎ బిర్లా స్కూల్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, మార్గ్ చిన్మయ విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్) కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. పెన్, పేపర్ విధానంలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.

పోస్టల్ బ్యాలెట్‌కు ప్రలోభాలు

రూ.2వేల నుంచీ రూ.3 వేల దాకా పంపిణీ



తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి):పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు ప్రలోభాలు ముమ్మరమయ్యాయి.నేటినుంచీ నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు పోలింగ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 22,299 మంది పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ వంటి కేటగిరీ ఓటర్లుండగా పీవో, ఏపీవో, ఇతర పోలింగ్ అధికారులు వంటి ఎన్నికల విధుల్లో వున్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు మాత్రం 16,552మంది వున్నారు. జిల్లాలో నివాసముంటూ ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులకు కేటాయించబడిన వారు మరో 3789మంది కూడా ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు. మొత్తం 20,341 మంది ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, టీడీపీ గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. కనిష్ఠంగా ఓటుకు రూ. 2 వేల నుంచీ గరిష్ఠంగా రూ. 3 వేల వరకూ ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం.తిరుపతిలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు పెద్దగా డిమాండ్ కనిపించలేదు. అధికార పార్టీ నేతలు కొందరు రంగంలోకి దిగి ఓటుకు రూ. 2 వేల వంతున పంపిణీని ముగించేసినట్టు తెలిసింది. అదే సమయంలో టీడీపీ ,జనసేన వర్గాలు ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేయనున్నట్టు శనివారం ఉదయం నుంచీ ప్రచారమైతే జరిగింది కానీ పంపిణీ మాత్రం చేయలేదని సమాచారం. చంద్రగిరికి సంబంధించి వైసీపీ వర్గాలు ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలను మినహాయించి మిగిలిన మండలాల్లో ఓటుకు రూ. 3 వేల వంతున సీల్డ్ కవర్లు అందజేసినట్టు తెలిసింది.శుక్రవారం ఉదయం నుంచీ మొదలుపెట్టి శనివారం మధ్యాహ్నానికే పని పూర్తి చేసినట్టు సమాచారం. టీడీపీ విషయానికొస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కొందరు ముఖ్యనేత వద్దకు వెళ్ళి డబ్బు పంచాల్సిన అవసరం లేదని, తామంతా మూకుమ్మడిగా టీడీపీకే ఓటు వేస్తామని నమ్మబలికినట్టు ప్రచారమవుతోంది. దీన్ని నమ్మి ముఖ్యనేత డబ్బు పంపిణీ వైపు దృష్టి పెట్టలేదని తెలిసింది. అయితే మరి కొందరు నాయకులు జోక్యం చేసుకుని సరికాదని చెప్పడంతో ఎట్టకేలకు రూ. 2 వేల వంతున పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తమకు ఓటు వేస్తారని నమ్మకమున్న వారిని మాత్రమే వైసీపీ నేతలు కలుస్తున్నారని, అలాంటి వారికి మాత్రమే ఓటుకు రూ. 2 వేల చొప్పున ముట్టజెపుతున్నట్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ నేతలు మాత్రం ఉద్యోగులందరినీ కలసి ఓట్లు అభ్యర్థించడంతో పాటు రూ. 2 వేల చొప్పున అందరికీ పంపిణీ చేస్తున్నట్టు తెలిసింది.వెంకటగిరిలో ఇరు పార్టీల నాయకులూ ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైసీపీ రూ. 2500 చొప్పున నగదు పంపిణీ చేయగా టీడీపీ రూ. 2 వేల చొప్పున ఇస్తున్నట్టు సమాచారం. అయితే తీసుకునే వారికే ఇస్తున్నారు తప్ప ఎవరినీ బలవంతపెట్టడం లేదని చెబుతున్నారు.

మూడురోజులపాటు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

- రేపటి నుంచి హోం ఓటింగ్

తిరుపతి(కలెక్టరేట్), మే 4:నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 8 ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల లోపు ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల పరిధిలో 8 ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.గూడూరులో 3,210మంది, సూళ్ళూరుపేటలో 2,180మంది, వెంకటగిరిలో 2,771మంది, తిరుపతిలో 4,685మంది, శ్రీకాళహస్తిలో 3,021మంది, సత్యవేడులో 1,747మంది, చంద్రగిరిలో 4,685మంది ఓటర్లున్నారు.వీరిలో పీవో, ఏపీవో, పోలింగ్ విధుల్లో ఉన్నవారు 16,552మంది కాగా అత్యవసర విధుల్లో ఉన్నవారు 674మంది. హోం ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్న వారిలో వయోవృద్ధులు 613మంది, దివ్యాంగులు 526మంది వున్నారు. జిల్లాలో ఓటు వుండి ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారు 3,789మంది వున్నారు. ఇతర జిల్లాల్లో ఓటు వుండి తిరుపతి జిల్లాలో విధుల్లో ఉన్న 5,351మంది తిరుపతి ఎస్వీ క్యాంపస్ హైస్కూల్లోని ఫెసిలిటేషన్ సెంట ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇంట్లోనే ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్న 85ఏళ్ల దాటిన వృద్ధులకు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు సోమవారం హోం ఓటింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగు సిబ్బంది ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు.

గూడూరులో ఫోన్ అభ్యర్థనలు

గూడూరు నియోజకవర్గంలో ఇరు పార్టీల నాయకులూ ఉద్యోగులకు ఫోన్లు చేసి తమకు అనుకూలంగా ఓటు వేయమని అభ్యర్థిస్తున్నారు తప్పితే ప్రలోభాల జోలికి వెళ్ళడం లేదని సమాచారం.పోలింగ్‌కు వెళ్ళడానికి వాహనాలు అవసరమైతే సమకూరుస్తామని మాత్రం చెబుతున్నట్టు తెలిసింది.సూళ్ళూరుపేటలో అయితే రెండు పార్టీల తరఫునా ఎవరూ ఉద్యోగులను ఓటడగడం లేదని సమాచారం. ఎలాగూ తమకు ఓటు వేయరన్న భావనతో వైసీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వైపు దృష్టి పెట్టలేదని తెలిసింది. అదే సమయంలో ఎలాగూ తమకే ఓటు వేస్తారు కదా అన్న ఉద్దేశంతో టీడీపీ నేతలు కూడా ఉద్యోగులను టచ్ చేయలేదని సమాచారం.

సత్యవేడులో ఇండిపెండెంట్ అభ్యర్థుల బేరసారాలు

సత్యవేడు నియోజకవర్గంలో పరిస్థితి తారుమారుగా వుంది. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల మద్దతు కోసం టీడీపీ, వైసీపీ రెండూ పట్టించుకోకపోవడం గమనార్హం. వైసీపీ నేతలు తాము అడిగినా ఉద్యోగులు ఓటు వేయరని, డబ్బు ఇచ్చినా ప్రయోజనం వుండదని భావించి ఉద్యోగులకు దూరంగా వున్నట్టు తెలిసింది. వైసీపీ వారు డబ్బిచ్చినా ఉద్యోగులు ఓటేసేది తమకేనన్న ధీమాతో టీడీపీ నేతలు సైతం పట్టించుకోవడం లేదని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. కాకపోతే ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బరిలో వున్న ఇద్దరు అభ్యర్థులు మాత్రం ఓటుకు రూ. 2 వేల చొప్పున పోస్టల్ బ్యాలెట్ ఓటర్లతో బేరసారాలు ఆడుతున్నట్టు సమాచారం.

వైసీపీ నేతల బాహాబాహి

మాచవరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

ప్రచారం చేయకనే వెనుదిరిగిన ఎమ్మెల్యే కిలివేటి



ఓజిలి, మే 4 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే , వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య సమక్షంలోనే వైసీపీ శ్రేణులు బాహాబాహీకి దిగాయి. రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం పిడిగుద్దులు కురిపించుకున్నారు.ఓజిలి మండలం మాచవరంలో శనివారం ఎన్నికల ప్రచారం నిమిత్తం కిలివేటి సంజీవయ్య వచ్చారు. గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పి.పుల్లారెడ్డి, మధురెడ్డి మధ్య దీర్ఘకాలంగా వర్గ విభేదాలున్నాయి.కిలివేటి సంజీవయ్య రాక సందర్భంగా తాము సూచించిన మార్గంలోనే ప్రచారం మొదలు పెట్టాలంటూ ఇద్దరు నాయకులూ పట్టుబట్టారు.ఈ సందర్భంగా ఇద్దరి మధ్యా మాటామాట పెరిగింది.కిలివేటి సర్దిచెపుతున్నా వినిపించుకోలేదు.ఇద్దరి అనుచరులూ పోటాపోటీ నినాదాలు చేశారు. ఇది కాస్తా శృతిమించి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు.దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పారు. ఈ పరిణామాలతో ఖంగుతిన్న కిలివేటి ఇద్దరు నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రచారం నిర్వహించకుండానే కారెక్కి వెనుదిరిగారు. నిజానికి సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీలో కుమ్ములాటలు రోజూ ఎక్కడో ఒక చోట బహిర్గతమవుతూనే వున్నాయి. గత నెలలో కిలివేటి నామినేషన్ల దాఖలు సమయంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట వైసీపీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే. వర్గ విభేదాలతోపాటు పెళ్లకూరు మండలంలో కొన్ని చోట్ల జనం సైతం నిలదీసిన ఘటనలున్నాయి.వారం రోజుల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో వీధి కొట్లాటలకు దిగుతున్న నాయకులు వైసీపీని పుట్టిముంచేస్తారేమోనని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

కత్తులతో యువకుల వీరంగం

పట్టుకుని కట్టేసిన అంజూరు గ్రామస్తులు





కేవీబీపురం, మే 4 : కేవీబీపురం మండలం అంజూరు గ్రామంలో శ్రీకాళహస్తికి చెందిన ఐదుగురు వ్యక్తులు కత్తులతో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. తాము వెంబడించి ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా ముగ్గురు పరారైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పాత గొడవల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని హతమార్చేందుకు వచ్చిన కిరాయి మూకలుగా అనుమానిస్తున్నారు.ఏఎస్ఐ కథనం మేరకు...అంజూరుకు చెందిన ధనశేఖర్, వెంకటేశులు మధ్య మూడు నెలల క్రితం భూవివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ధనశేఖర్‌పై వెంకటేశులు వర్గం దాడికి ప్రయత్నించగా ఇరు వర్గాలూ పోలీసులకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు.దీంతో ఇరువర్గాలపైనా హత్యయత్నం కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ధనశేఖర్‌కు సంబంధించిన వ్యక్తులు శ్రీకాళహస్తి నుంచి అంజూరుకు చేరుకుని కత్తులతో హల్‌చల్ సృష్టించారు. వెంకటేశులుపై దాడికి ప్రయత్నించగా గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారు పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి ఇద్దరిని పట్టుకుని స్తంభానికి కట్టేశారు.గట్టిగా ప్రశ్నిస్తే ధనశేఖర్ పంపితే వచ్చామని తెలిపారు. పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, మే 4: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చిపై అధిష్ఠింపజేసి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు

అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి

తిరుచానూరు, మే 4: పద్మావతి అమ్మవారిని కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వాదం ఇచ్చి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల బీజేపీ నేతలు గుండాల గోపీనాథ్, గిరిధర్, ప్రభాకర్‌గౌడ్, దీపక్ యాదవ్ తదితరులు కేంద్రమంత్రిని సన్మానించారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



కమ్మపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రామచంద్రాపురం, మే 4: మండలంలోని కమ్మపల్లి, కొత్తకండ్రిగ, వెంకట్రామపురం పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. గత ఎన్నికల్లో రీపోలింగ్ కారణాలు తెలుసుకుని ఈ సారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో తహసీల్దారు ఉషారాణి, బీఎల్వోలు పాల్గొన్నారు.

వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి శిబిరాలు



తిరుపతి అర్బన్, మే 4: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కార్యదర్శి మల్లారపు నాగార్జున ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలకు దాదాపు 200మంది హాజరవుతున్నారు. హెచ్.అరుణ శివప్రసాద్, అర్చన, జి.సుధాకర్, డి.విజయకుమార్, ఎం.ఎస్.యుగంధర్‌బాబు, వి.బాలాజీచౌదరి, గురుస్వామి, కె.ఎస్.బాలసుబ్రహ్మణ్యం, సంగరాజుఅశ్విని, బి.కిరణ్‌కుమారి, ఎస్.భువనేశ్వరి, జి.గాయత్రి తదితరులు టీచర్లుగా, శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి నడ్డి నారాయణ, పి.గురునాథం, మునిలక్ష్మి, దామోదరం, రఫీ తదితరులు సహకారం అందిస్తున్నారు.

కర్రసాములో శిక్షణ ప్రారంభం

తిరుపతి(కల్చరల్): వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా శనివారం నుంచి చిన్నారులకు నెలరోజుల పాటు కర్రసాములో శిక్షణ ప్రారంభించారు. మాస్టారు మునిరాజు శిక్షణ ఇస్తున్నారు.

వైసీపీని ఓడిస్తేనే దళితులకు రక్షణ

- దళిత బహుజన ఫ్రంట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 4: ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రంలో దళిత బహుజనులకు రక్షణ ఉంటుందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి భాగ్యరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్ దళిత, బహుజనుల హక్కులను కాలరాశారని ఆరోపించారు. దళితులకు చెందిన 27 పథకాలను రద్దు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. దళితులపై హత్యలు, అత్యాచారాలు, అక్రమ కేసులతో వేధించారని ఆరోపించారు. అంబేడ్కర్ పేరు గల విదేశీ విద్య పథకానికి జగన్ తన పేరు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్యారాణి, చిత్తూరు జిల్లా కార్యదర్శి నత్తం హరిబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

పాకాల, మే 4: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో శనివారం ఉప్పరపల్లె పంచాయతీ సూరినేనివారిపల్లెకు చెందిన పలువురు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు.

తిరుపతిరూరల్: మండలంలో అవిలాల పంచాయతీకి చెందిన వైసీపీనేతలు శనివారం చిన్నగొట్టిగల్లు పర్యటనలో ఉన్న పులివర్తినాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీబాలాజీ రజక సహకార సేవాసంఘం అధ్యక్షుడు శ్రీను, సెక్రటరీ మనోహర్ తదితరులు పసుపు కండువా కప్పుకున్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి టీడీపీలో చేరిక



రామచంద్రాపురం: మండలంలోని వేపకుప్పం గ్రామానికి చెందిన గుండె వైద్యనిపుణుడు డాక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పులివర్తి నాని సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. ఇదే గ్రామానికి చెందిన మాజీ వైసీపీ సర్పంచులు శంకరయ్య, రామభద్ర కూడా టీడీపీలో చేరారు. తిరుమలరెడ్డి, నరసింహారెడ్డి, జనార్ధన్‌చౌదరి, లీలామోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓటర్లపై అధికారులు నిఘా ఉంచాలి: టీడీపీ



మాట్లాడుతున్న దొడ్ల కరుణాకరరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 4: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో దొంగ ఓటర్లపై అధికారులు నిఘా ఉంచాలని టీడీపీ నాయకుడు దొడ్ల కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, ఇందుకు అధికారులు కూడా సహకరించారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్ఠంగా నిర్వహించాలని సూచించారు. దొంగోట్లతో ఎలాగైనా తన తనయుడిని గెలిపించుకోవాలని చెవిరెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆర్టిఫిషియల్ డెవలప్‌మెంట్ తప్ప నిజమైన అభివృద్ధి జరగలేదని అభిప్రాయపడ్డారు. తుమ్మలగుంట చెరువును సహజ సిద్ధంగా పరిరక్షించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు చెంగల్రామా నాయుడు, రాధారాయల్, సిద్ధారెడ్డి, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

తిరుపతి (కల్చరల్) మే 4: తిరుపతిలో శనివారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు గోవిందరాజ స్వామి ఆలయ మాడవీధుల్లో రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్.రాజ, నరసింహారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, మునిరత్నమాచారి, విక్రమ్, కన్నారెడ్డి, శాంబోలు హరనాథ్, వాసు రెడ్డి, చెంగారెడ్డి, తిరుపాలాచారి, ధనమ్మ, జయమ్మ, పవిత్ర తదితర కళాకారులు పాల్గొన్నారు.



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని హైదరాబాదులోని ఆయన స్వగృహంలో కలిసి తిరుమలేశుడి జ్ఞాపిక అందజేసిన టీడీపీ నేత ఇందుశేఖర్

ప్రమాదస్థలాన్ని పరిశీలించిన ఎస్ఈ



రామచంద్రాపురం, మే 4: తాటిమాకుల కండ్రిగ వద్ద విద్యుత్ ప్రమాదంలో శుక్రవారం మహేష్‌బాబు అనే రైతు మృతి చెందిన సంఘటనపై ఎస్ఈ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఆరాతీసి, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిదిగా సిబ్బందికి సూచించారు. ఏడీ చిన్నరెడ్డెప్ప, ఏఈ రామమూర్తి పాల్గొన్నారు.

టైగర్ ఆఫ్ మైసూర్ - టిప్పు సుల్తాన్ పుస్తకావిష్కరణ



తిరుపతి (జీవకోన), మే 4: నవ భారత సహ సమాజ సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన టైగర్ ఆఫ్ మైసూర్ - టిప్పు సుల్తాన్ పుస్తకాన్ని స్థానిక చెన్నారెడ్డి కాలనీలో ఎన్ఎస్ఎస్ శిక్షణ కేంద్రంలో సంస్థ జనరల్ సెక్రటరీ ఎండీ రహంతుల్లా షరీఫ్ శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సమన్వయకర్త సురేఖ, ట్రైనింగ్ సెంటర్ శిక్షకురాలు లావణ్య మాట్లాడుతూ ఈ పుస్తకం తిరుపతిలోని వివిధ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సంస్థ సిబ్బంది సుమలత, జావీద్, నీలావతి, కలివాని, సమీనా, షర్మిలభాను, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

21 ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు

తిరుపతి(నేరవిభాగం), మే 4: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కలిపి ఎన్నికల కమిషన్ 21 ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాల్లో పనిచేస్తున్న అధికారులు 24 గంటల పాటు పర్యటిస్తూ ఎన్నికల్లో ఎక్కడైనా జరిగే అక్రమాలు, అవకతవకలను సీసీ కెమెరాల్లో బంధిస్తారు. దీనికోసం ప్రతి వాహనానికి ముందు, వెనుక వైపు రెండు కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి వాహనాల రాక పోకలతో పాటు ప్రతి సంభాషణను రికార్డు చేస్తాయి. ఇదంతా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వున్న ఎన్నికల కంట్రోల్ రూముకు దృశ్య రూపంలో కనిపించడంతో పాటు శబ్ద రూపంలోనూ వినిపిస్తోందని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ చెప్పారు. ప్రస్తుతం నిఘా వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో ఓటర్లను ప్రలోభాలు పెట్టే వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తనున్నాయి.

మంచినీళ్లు ఇస్తానన్నావు... మరిచావేం..?

చెవిలో పువ్వు

- చెవిరెడ్డిపై బీటీఆర్ కాలనీ వాసుల ఆగ్రహం

మంగళం, మే 4: ఎమ్మెల్యే కావాలంటే ప్రజల ఓట్లు కావాలి. ఓట్లు పడాలంటే హామీలు ఇవ్వాలి. ఇలా అమలు కాని హామీలు ఇచ్చి 2019 ఎన్నికల్లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి మంగళం పరిధిలోని బీటీఆర్ కాలనీలో ఉన్న ప్రజల చెవిలో పువ్వులు పెట్టాడు. అపుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీటీఆర్ కాలనీలోని 9వ లైన్‌లోని కమిటీ హాల్ వద్ద ప్రజలతో మాట్లాడుతూ మూడునెలల్లో ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, ప్రతి ఒక్కరికీ తెలుగుగంగ నీరు అందిస్తానని హామీ ఇచ్చాడు. ఆయన ఎమ్మెల్యే అయ్యాక ఐదేళ్లు అయినా తాగునీటి సమస్యకు ఇచ్చిన హామీ పరిష్కారం కాలేదు.

తాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు

- టి.నాగమణి, బీటీఆర్ కాలనీ, వార్డు మెంబరు



2019లో ఎన్నికల ప్రచారానికి వచ్చి 3 నెలల్లో తెలుగుగంగ నీరు ఇస్తానని చెవిరెడ్డి ఇచ్చిన హామీని నమ్మి ఓట్లు వేశాం. ఆ తరువాత పంచాయతీ సమావేశాలు జరిగిన ప్రతిసారీ దీనిపైనే చర్చించాం. ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రతి వేసవిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు కూడా ఆయనకు తెలుసు. అయినా ఎందుకో తెలుగు గంగ నీరు ఇవ్వలేకపోయారు.

వారానికి ఒకసారే నీటి సరఫరా

- ఎ.లత, బీటీఆర్ కాలనీ



మూడు నెలల్లో తెలుగుగంగ నీరు ఇస్తానని చెవిరెడ్డి చెప్పిన మాటలు నమ్మినందుకు అప్పటి నుంచి ఇప్పటి వరకు వేసవిలో వారానికి ఒకసారి మాత్రమే నీరు ఇస్తున్నారు. ఇక్కడ ఉన్న 3వేల కుటుంబాలు కూలీ పనులు చేసుకునేవారే. మంచినీరు ఇస్తామని ఆయన చెప్పిన మాటలు విని ఓట్లు వేస్తే ఇప్పటికీ కుళాయిల వద్ద కొట్లాటలు తప్పడంలేదు. వాటర్ క్యాన్లు రూ.15 ఇచ్చి కొనుకుంటున్నాం.



బీటీఆర్ కాలనీలో వీధి కుళాయి వద్ద నీటి కోసం అవస్థలు పడుతున్న మహిళలు

రుయాలో అత్యంత క్లిష్టమైన సర్జరీ

- మహిళ కిడ్నీలో నుంచి 300 గ్రాముల రాయి తొలగింపు



సర్జరీ అనంతరం కోలుకున్న బాధితురాలితో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), మే 4: రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో భాగంగా ఓ మహిళ కిడ్నీలో 300 గ్రాములకుపైగా ఉన్న రాయిని అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్సతో బయటకు తీశారని సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఆస్పత్రిలో శనివారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన రీతాదేవి అనే మహిళ వలస కూలీగా వచ్చి తిరుపతి పరిసర ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమెకు కొంతకాలంగా కడుపు కింద విపరీతమైన నొప్పి వస్తుండటంతో పలు ఆస్పత్రుల్లో చూపించుకుంది. తగ్గకపోవడంతో వారం కిందట రుయాస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించగా కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. కిడ్నీ వైద్య నిపుణుడు సప్తగిరి ప్రసాద్ బృందంతో కలిసి ఆమెకు సర్జరీ చేసి కిడ్నీలో ఉన్న రాళ్లను తొలగించారు. వీటిల్లో ఒకటి 300 గ్రాములకుపైగా ఉన్నట్లు రవిప్రభు తెలిపారు. ఇంతటి భారీ రాయిని తొలగించాలంటే ఆమె ఆరోగ్య పరిస్థితి సహకరించదని గుర్తించి.. అధునాతన పద్ధతిలో అత్యంత క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా తమ వైద్యబృందం చేసిందని ప్రశంసించారు. ప్రస్తుతం రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేస్తున్నామని చెప్పారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, పీజీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్‌ను రద్దుచేస్తాం

- పులివర్తి నాని



మాట్లాడుతున్న పులివర్తి నాని

భాకరాపేట, మే 4: ఇటీవల వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా భూమి గల ప్రతి ఒక్కరికీ ఎంతో నష్టమని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని రద్దు చేస్తామని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని స్పష్టం చేశారు. శనివారం ఉదయం దేవరకొండలో ప్రారంభించిన ఎన్నికల ప్రచారం రాత్రి చిన్న గొట్టిగల్లు గ్రామం వరకు నిర్వహించారు. చిన్న గొట్టిగల్లులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఒక్క అవకాశం కల్పిస్తే చంద్రగిరి అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొట్టే శివకుమార్, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ సునీత దామోదరం, ఎంపీటీసీ విజయకుమారి, మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం, కుమార్‌స్వామిరెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మౌలాలి, చలపతి, మల్లికార్జునరెడ్డి, వెంకటరత్నం, లోకనాథం, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భాకరాపేటకు చెందిన బలిజపల్లికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

బీజేపీలో చేరిన నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 4: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరుపతికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ నేషనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ, ఏపీ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి శివప్రకాష్, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం కలికిరిలోని కిరణ్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో బీజేపీ నాయకులు నవీన్‌కు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ.. తరతరాల రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబానికి చెందిన నవీన్ కుమార్‌రెడ్డి బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటిత మంత్రి మధుకర్, మోహన్, బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ సిట్టింగ్ ఎంపీ మోహన్, బీజేపీ పార్లమెంటు ఇన్‌చార్జి సిద్ధరాజు, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర బీజేపీ నాయకులు కోలా ఆనంద్, భానుప్రకాష్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి జయంతి



తిరుపతి(కల్చరల్), మే 4: తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సంగీత పితామహుడు, వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి జయంతి వేడుకలు స్థానిక యూత్ హాస్టల్లో జరిగాయి. సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ... కర్ణాటక సంగీతానికి చెందిన త్రిమూర్తులలో త్యాగరాజ స్వామి ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. సత్యనారాయణ, గోవింద శెట్టి, రావిపాటి సత్యనారాయణ, రామచంద్రయ్య, మునితర్నం, అన్నవరపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెనుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం



రవీంద్ర నగర్‌లో విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మలు, నడవలూరు వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

తిరుపతి(ఆటోనగర్), మే 4: తిరుపతిలో శనివారం సాయంత్రం వీచిన పెనుగాలులకు రవీంద్రనగర్ ఆరో క్రాస్ రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ పక్కన నీలగిరి చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో తెగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రేణిగుంట నుంచి తిరుపతికి విద్యుత్ సరఫరా అవుతున్న 132 కేవీ డిస్కులు పగిలిపోయాయి. వరదరాజనగర్ ప్రాంతంలోనూ చెట్టుకొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మూడ్రోజులుగా తిరుపతి నగర పరిధిలో వీచిన పెనుగాలులకు సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ఆదివారం జరగనున్న నీట్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆర్సీపురంలో గాలీవాన బీభత్సం

- 9గంటల పాటు విద్యుత్ అంతరాయం

రామచంద్రాపురం, మే 4: మండలంలో శనివారం మధ్యాహ్నం గాలీవాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో హోరుగాలులు వీచడంతో నడవలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నాలుగు స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల చిన్నపాటి వృక్షాలు నేలకొరగగా, అరకొరగా కాచిన మామిడికాయలు రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సిబ్బంది మధ్యాహ్నం నుంచి రాత్రి 9గంటల వరకు మరమ్మతులు చేసినప్పటికీ సరఫరా పునరుద్ధరణ కాలేదు. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. రామాపురం నుంచి పీవీపురం వరకు గంట పాటు మోస్తరు వర్షం కురవడంతో వేరుశనగ, చెరకు తోటలకు కొంత మేలు చేసింది.

చంద్రగిరిలో...

చంద్రగిరి, మే 4: చంద్రగిరిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. వేసవి కాలంలో ఎండ తీవ్రతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వర్షం కురవడంతో చంద్రగిరిలో వాతావరణం చల్లబడింది. ప్రజలు ఉక్కపోత నుంచి ప్రశాంతత పొందారు.

వేద, సంస్కృత శాస్త్రాల అధ్యయనంతో

వైజ్ఞానికులుగా తయారుకావాలి

- ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, మే 4: వేద, సంస్కృత శాస్త్రాలు రెండింటినీ అధ్యయనం చేసి వైజ్ఞానికులుగా తయారుకావాలని తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సూచించారు. ఎస్వీవేద వర్సిటీలో నాలుగురోజులపాటు నిర్వహించిన విశ్వ వైదిక విజ్ఞాన సమ్మేళనం శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వైదిక విజ్ఞానంలో ఉత్తర, దక్షిణ ధ్రువంలా ఉన్న వైదిక, ఆధునిక వైజ్ఞానికులందరూ కలసి పనిచేసి వేదవిజ్ఞాన్ వైభవాన్ని నలుదిశలా ప్రసరింపచేయాలని ఆకాంక్షించారు. గౌరవఅతిథిగా వచ్చిన బిహార్‌కి చెందిన ప్రఫుల్లకుమార్ మిశ్రా మాట్లాడుతూ వైజ్ఞానిక విషయాలను పుస్తకరూపంలో తీసుకురావాలని చెప్పారు. వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ వర్సిటీ ఆవిర్భావం నుంచి ఎన్నో ప్రసిద్ధమైన కార్యక్రమాలు నిర్వహించామని, ఈసదస్సులో 90మంది పరిశోధకులు వైజ్ఞానిక అంశాలపై పరిశోధనాపత్రాలు సమర్పించారని తెలిపారు. తిరుపతి ఐఐటీ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ డీన్ కేఎస్ రాఘవరావు, సంస్కృతపండితులు దినేష్‌కామత్, ప్రొఫెసర్ తారకరామకుమారశర్మ, ప్రొఫెసర్ రాధాగోవిందత్రిపాఠి, ఎఫ్‌వో అంజిరెడ్డి, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, హెడ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో టీడీపీనేతల ప్రచారం

తిరుపతిరూరల్, మే 4: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లెలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీ పరిధిలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ బి.మధు నాయుడు, ఆర్.రాజేంద్రప్రసాద్, ఆర్.ఆనందచౌదరి పాల్గొన్నారు.

డబ్బుకోసం సీఎం దేన్నైనా తాకట్టు పెట్టేస్తాడు

- వెంపటి మాధవ నాయుడు

డక్కిలి, మే 4: డబ్బు కోసం సీఎం జగన్.. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టేందుకు సిద్ధపడ్డాడని, మళ్లీ సీఎం చేస్తే ప్రజల ఆస్తులు కూడా తాకట్టు పెట్టేందుకు పథకం సిద్ధ చేసుకున్నాడని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి వెంపటి మాధవనాయుడు అన్నారు. శనివారం రాత్రి ఆయన పలుగోడులో ప్రచారం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జగన్ మళ్లీ గెలుస్తామన్న నమ్మకంతోనే ల్యాండ్ టైటలింగ్ యాక్టు తీసుకు వచ్చారన్నారు. గెలిచాక పాలన సాగించాలంటే డబ్బులు ఉండవు కాబట్టి ఆ యాక్టు ద్వారా ప్రజల భూములను విదేశీ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ప్రభుత్వాని నడిపించాలని పన్నాగం పన్నాడన్నారు. ఇకపై ఒరిజినల్ పత్రాలు ప్రజల దగ్గర ఉండవన్నారు. రైతులు, దళితుల అసైన్డ్ భూములను లాగేసుకుంటారన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లే లక్ష్యంగా....

- ప్రలోభ పెట్టేందుకు ఉద్యోగసంఘం నేత ప్రయత్నం

తిరుపతి(వైద్యం), మే 4 : ప్రముఖ ఉద్యోగ సంఘం అధ్యక్ష పదవిలో ఉన్న ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగి ఒకరు పోస్టల్ బ్యాలెట్లను వైసీపీకి అనుకూలంగా వేయించేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆది నుంచి స్థానిక అధికార పార్టీ నేతలకు విధేయుడిగా ఉంటూ వస్తున్న ఈయన ఉద్యోగులను వారి దగ్గరకు తీసుకువెళ్లడం, ఆత్మీయ సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వంపై ఉద్యోగ సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టిన సమయంలోనే ఆయన అధికార పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి పలువురు ఉద్యోగులను బలవంతంగా ఆ సమావేశానికి తీసుకువెళ్లాడు.తిరుపతి జిల్లా పరిధిలో దాదాపు 20 వేలకు పైగా బ్యాలెట్ ఓట్లుండడం అందులో 11 వేలకు పైగా తిరుపతిలోనే ఉండడంతో ఈ బ్యాలెట్ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఆయన గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.రహస్యంగా ఉద్యోగులను సమావేశపరిచి ప్రలోభాలకు గురి చేయడం, కాదు కూడదు అనే వారికి ఒక్కో ఓటుకు రూ. 5 వేలకు పైగా ఇప్పిస్తానని హామీ ఇవ్వడం వంటివి చేస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే రుయాస్పత్రిలోని నర్సింగ్ విభాగంలో ఉన్న దాదాపు 200 మంది ఉద్యోగులతో ఆయన ఇప్పటికే కలిసి వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు ఓటు వేస్తే మీ పదోన్నతులు, బకాయిల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని చెప్పినట్లు సమాచారం.ఉద్యోగినుల బాధ్యతలను నర్సింగ్ విభాగంలోని కీలక మహిళకు అప్పగించడంతో ఆమె కూడా ఉద్యోగులను ప్రలోభ పెడుతున్నట్లు పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

రూ.4 లక్షల విలువైన మోటర్ల చోరీ

నాయుడుపేట టౌన్, మే 4: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో మెకానిక్ దుకాణాల్లో రూ.4 లక్షల విలువైన మోటర్లు చోరీ అయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాత బస్టాండ్ సమీపంలో మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్న పయాజ్ ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి దుకాణాన్ని మూసుకొని ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. దుకాణంలోకి వెళ్లి పరిశీలించగా రూ.3 లక్షల విలువైన మోటర్లు చోరీ జరిగినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అలాగే ఈ దుకాణానికి సమీపంలో ఉన్న మరో దుకాణంలో కూడా రూ.లక్ష విలువైన మోటర్లు చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందింది.

రెండు వర్గాల ఘర్షణ: నలుగురిపై కేసు

ఏర్పేడు, మే 4: మోదుగులపాళెంలో రాజేష్, శ్రీనివాసులు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. శుక్రవారం సాయత్రం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. రాజేష్ ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, హరి, కృష్ణయ్య, నాగరాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వాళ్లు ఇక్కడ.. వీళ్లు అక్కడ?

- పుత్తూరు, వడమాలపేట ఉద్యోగులకు తిరుపతిలో బ్యాలెట్ పోలింగ్ కేంద్రం
- నగరి, నింద్ర, విజయపురం వారికి పుత్తూరు కేటాయింపు

పుత్తూరు అర్బన్, మే 4: నగరి నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల నిర్ణయం గందరగోళానికి దారి తీస్తోంది. పుత్తూరు, వడమాలపేటకు చెందిన పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్‌లో పోలింగ్ కేంద్రం కేటాయించడం పట్ల ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అలాగే నగరి, నింద్ర, విజయపురానికి చెందిన ఓటర్లకు పుత్తూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. నగరి నియోజకవర్గాన్ని రెండుగా విభజించి పోలింగ్ కేంద్రాలను కేటాయించడం పట్ల వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నపళంగా శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలను మార్చడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు మాత్రం చిత్తూరు కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, నగరి ఆర్డీవో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. ఎన్నికల నిర్వహణ వ్యవహారాలు ఇక్కడి ఆర్డీవో పరిధిలోకే వస్తాయి. సాధారణంగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఆయా నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరి నియోజకవర్గానికి పుత్తూరును ఎంపిక చేశారు. నగరిలో సరైన వసతు లున్న పాఠశాలలేవీ లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని ఉద్యోగులు పుత్తూరులోనే బ్యాలెట్ ఓటింగ్ వేయాల్సి ఉంటుంది. శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలను తిరుపతి కలెక్టరు విడుదల చేసిన కేంద్రాల ప్రకటనలో పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని ఉద్యోగులు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్‌లో ఓటు వేయాలని పేర్కొన్నారు. దీంతో పుత్తూరు, వడమాల పేట నుంచి తిరుపతికి వచ్చి ఓట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే, చిత్తూరు జిల్లా పరిధిలోకి వచ్చే నగరి, నింద్ర, విజయపురం మండలాల ఉద్యోగులు మాత్రం తిరుపతి జిల్లాలోని పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేయాలి. ఇలా పుత్తూరు, వడమాలపేట వాళ్లు తిరుపతికి... విజయపురం, నింద్ర, నగరి మండలాల వాళ్లు పుత్తూరుకు వచ్చి ఓటు వేయాల్సి రావడంపై ఉద్యోగ సంఘాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఎండల్లో ఇలా తిప్పించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం

పోలింగ్ సమీపిస్తున్నా ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, కొందరు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆరోపించారు. శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాన్ని తిరుపతిలో ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి కలెక్టర్ ప్రకటించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హడావిడి నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఓటు ఉంటే పక్క నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం ఏమిటని నిలదీశారు. ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోను తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రభుత్వానికి, వంత పాడుతున్న అధికారులకు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసీపీలో కార్పొరేటర్ల అలజడి

బలప్రదర్శనకు హడావుడిగా సమావేశం - అయినా నలుగురు డుమ్మా

సీట్లు మీకు.. మైకులు మాకా? అంటూ ఓ కార్పొరేటర్ అసహనం

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): జనసేన, టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్లు పెద్దఎత్తున చేరబోతున్నారన్న ప్రచారం తిరుపతి నగరంలో పెరగడంతో వైసీపీ నేతలు హడావుడి పడుతున్నారు. 'ఎవర్ని అనుమానించాలో తెలియడం లేదు. అందరూ మీడియా సమావేశం ఏర్పాటుచేసి అమ్ముడుపోమని ఖండించండి' అని వైసీపీ స్థానిక ముఖ్యనేత తన నివాసంలో కార్పొరేటర్లకు శుక్రవారం రాత్రి అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. దీంతో మేయర్ డాక్టర్ శిరీష నేతృత్వంలో శనివారం ఒక హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ప్రకటించిన సమయానికి చాలా మంది కార్పొరేట్లు రాకపోవడంతో కొంత ఆందోళనపడి, ఫోన్‌లతో వెంటబడ్డారు. కార్పొరేటర్లను మాట్లాడమని మైకులిస్తుంటే ఓ కార్పొరేటర్ 'సీట్లు మీకు..మైకులు మాకా?'అంటూ సభాముఖంగానే ప్రశ్నించారు. అప్పటికీ సునీత, ఆరణి సంధ్య, సీకే రేవతిలు గైర్హాజరు కాగా పలువురు కార్పొరేటర్ల భర్తలు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సమావేశానికి హాజరైనవారిలో పదిమందివరకు ముభావంగా కనిపించారు. మొత్తానికి తామంతా భూమన కుటుంబమే అని, అమ్ముడుపోమని నాయకులు చెప్పారు. కాగా.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తిరుపతి పర్యటన సందర్భంగా పలు కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయని, సమావేశం అనంతరం పలువురు కార్పొరేటర్లు చర్చించుకోవడం గమనార్హం. వైసీపీకి తొలుత 48 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో అన్నా సిస్టర్స్ అన్నా సంధ్య, అన్నా అనితలు ఇటీవల పార్టీని వీడిన విషయం తెలిసిందే. మరో కార్పొరేటర్ హనుమంత్ నాయక్ అనారోగ్యంతో మృతిచెందారు. ప్రస్తుతం 45 మంది కార్పొరేటర్లలో పదిమంది వరకు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరబోతున్నట్టు తిరుపతిలో ప్రచారం జరుగుతోంది.

తిరుమలలో వర్షం : ఇబ్బంది పడిన భక్తులు



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కూడా వర్షం కురిసింది. గురు, శుక్రవారాల తరహాలో శనివారం కూడా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు వరకు భారీ వర్షం పడటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కమ్మేశాయి. గంట పాటు వానపడి ఆగిపోయింది. శ్రీవారి ఆలయం ప్రాంతంతోపాటు మాడవీధులు, కాటేజీలు, పార్కులు, రోడ్డు తడిచిముద్దయ్యాయి. సాయంత్రానికి తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోవడంతో భక్తులు ఉపశమనం పొందారు.

ఆధ్యాత్మిక తిరుపతిని గంజాయి కేంద్రం చేశారు

ఎపిక్ కార్డుల కుంభకోణం వెనుక ఆ యువకుడే సూత్రధారి ● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్

ఫటాఫట్ !



తిరుమల, తిరుపతి కేంద్రంగా జరిగే అన్యాయాల మీద సూటిగా విరుచుకుపడే నాయకుడు సామంచి శ్రీనివాస్. వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ వ్యవస్థాపకుడు. న్యాయవాది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి. వైసీపీ అభ్యర్థి భూమన అభినయరెడ్డి నిశ్శబ్ద రాజకీయాల వెనుక చాలా ఉందంటూ విమర్శలు చేస్తున్నారు. బీజేపీ తరపున తిరుపతి పార్లమెంటరీ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా నియమితులై, ఎన్నికల నిర్వహణలో బిజీబిజీగా ఉన్న సామంచితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

? అనూహ్యంగా తెరపైకి వచ్చిన మీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కి కేడర్ సహకారం ఎలా వుంది.

! అందరి అంచనాలకు అనుగుణంగా ఆయన పని తీరు ఉంది. ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవం తోపాటు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కావడంతో ఆపార్టీలోని అసంతృప్తులు కూడా పనిచేస్తున్నారు. ఇప్పటికే నాలుగైదుసార్లు పార్లమెంటు నియోజకవర్గం మొత్తం కలియతిరిగారు. 1999లో ఐఏఎస్ అధికారి వెంకటస్వామి బీజేపీ ఎంపీగా గెలుపొందారు. నరేంద్ర మోదీ సమర్థత, కూటమి జతకావడం వల్ల అదనంగా వచ్చిన బలంతో అప్పటి ఫలితాలు పునరావృతం కాబోతున్నాయి.

? తిరుపతిని గంజాయివనంగా మార్చేశారంటూ మీరు తరచూ విమర్శ చేస్తున్నారు.

! ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో అనేక అవాంఛనీయ ఘటనలకు విచ్చలవిడి మత్తు పదార్థాల వినియోగమే కారణం. గతంలో కరుణాకర రెడ్డి మోకాటి లోతు నీళ్లలో దిగి మద్యరహిత నగరంగా కావాలని డిమాండు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతిలో గంజాయి కనపడకూడదని చెట్టూ, పుట్టా తిరిగారు. ఈ రెండూ జరగకపోగా మరింతగా పెరిగిపోయింది. అసలు రహస్యం ఏమిటంటే.. వికేంద్రీకరణగా జరిగే గంజాయి వ్యాపార గుట్టును తెలుసుకుని కేంద్రీకృతం చేశారు. జనావాసాలు లేని చోట్ల వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు గంజాయి బ్యాచ్‌కు ఆవాసాలుగా మారాయి. యాత్రికులు, ప్రజలపై విచక్షణకోల్పోయి దాడులకు పురుగొల్పేది గంజాయి బ్యాచ్‌లే. యువత పెడదోవ పట్టడానికి పాలకులే కారణం

? గంజాయికి, రాజకీయాలకి సంబంధం ఉందా.

! గంజాయి, గుట్కా వ్యాపారాలు చేసేవారు పెద్దపెద్ద మాఫియా డాన్లుగా ఎదిగారు. చేతికి మట్టి అంటకుండా ఎవరిచేతనో చేయించి కోట్లాది రూపాయలు చేరేది ఇలాంటి మాఫియా బిజినెస్ వల్లనే. కరోనా సమయంలో గుట్కా వ్యాపారం చేసింది కూడా వైసీపీ నేతలే. వారికి కప్పం కట్టేవారిపై కేసులు ఉండవు. కట్టనివారిపై కేసులుపెట్టి లొంగదీసుకుంటారు.

? 34వేల ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ వెనుక 34 ఏళ్ల యువకుడు ఉన్నాడని అనేశారేంటి.

! నేను చెప్పడం కాదు. అందరికీ తెలుసు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కుంభకోణమిది. ఎన్నికల వెబ్‌సైట్‌లోకి చొరబడి 34వేల ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకున్న కుట్ర వెనుక 34 ఏళ్ల వయస్సున్న కుర్రాడు ప్రమేయం ఉందన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఆ యువకుడిపై వేళ్లన్నీ చూపిస్తున్నాయి. ఈ ఉదంతంపైనే ఓ ఐఏఎస్ అధికారి, ఇతర అధికారులు కేసులు మోయాల్సి వస్తోంది.

? అభినయ్ మీద మీరు విమర్శలు చేస్తున్నా అతను మౌనంగానే ఉన్నాడు ఎందుకు.

! అభ్యర్థి మౌనంగా ఉన్నాడంటే సమాధానాలు చెప్పలేకపోతున్నాడనే అర్థం. అయితే ఆయన చాపకింద నాయకుడు. జగన్‌రెడ్డి ప్రభుత్వానికి సమాంతరంగా తిరుపతిలో తన మిత్రులకు రెవెన్యూ, హోం, మున్సిపాల్టీ, హెల్త్, దేవదాయ ఇలా.. ఒక్కొక్కరికి ఒక్కొక్క శాఖ అప్పగించారు. ఆయా శాఖల్లో వీరిదే హవా! వీరందరి చేత స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారు. తద్వారా ఏజెంటు పాసులు తప్పుదారి పట్టే అవకాశం ఉంది. అందుకే మేము అదనపు బలగాలను కోరుతున్నాం. ఎన్డీయే కూటమి ఏర్పడ్డాక భూమనలో ఓటమి భయం పట్టుకుంది. ఐదేళ్ల పాటు ప్రజలు పంటిబిగువున వీరిని భరిస్తున్నారు. పితృ, పుత్ర వేధింపుల నుంచి తిరుపతి బయటపడాలని ప్రజలు ఓనిర్ణయానికి వచ్చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీకి భారీ షాక్

- టీడీపీలోకి దొడ్డారెడ్డి కుటుంబం
- జనసేనలోకి శెట్టిపల్లె నేతలు
- భూమనకు ఓటమి భయం: ఆరణి



ఆరణి సమక్షంలో టీడీపీలో చేరిన దొడ్డారెడ్డి కుటుంబీకులు, సుగుణమ్మ, మోహన్, నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి భారీ షాక్ తగిలింది. పెద్దకాపు వీధికి చెందిన దొడ్డారెడ్డి కుటుంబం శనివారం టీడీపీలో చేరింది. దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో దొడ్డారెడ్డి ప్రకాష్‌రెడ్డి, జి.కె.రమణ, జీకే సుధ, మునిరత్నం, రమణారెడ్డి, ప్రసాద్, బి.గణేష్, తాతయ్య, పెరుమాల్, జయరాం, శరహరి, హరి, ప్రసన్న, మణితోపాటు వందమంది టీడీపీలో చేరారు. తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్డీయే బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూకబ్జాలు, కమీషన్లతో ఐదేళ్లుగా తిరుపతిని పట్టిపీడించిన భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ రెడ్డిలకు ఓటమి భయం పట్టుకుందని, ఇక రాజకీయ సన్యాసం తప్పదని అన్నారు. వైసీపీలో దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డికి ప్రాధాన్యం దక్కలేదని నరసింహయాదవ్ చెప్పారు. టీడీపీలో సముచిత స్థానం ఇస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ.. కరుణాకర రెడ్డి అహంకారపూరిత పాలనను ప్రజలు తిరస్కరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మోహన్ మాట్లాడుతూ.. 2004లో ఒక ఇల్లు మాత్రమే ఉన్న భూమన కుటుంబానికి 2024నాటికి వేలకోట్ల రూపాయలు ఎలా వచ్చాయో ప్రజలకు తెలపాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళీ కృష్ణా రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, కృష్ణయాదవ్, చినబాబు, ఆముదాల తులసి, పుష్పావతి పాల్గొన్నారు



జనసేనలో చేరిన శెట్టిపల్లెవాసులతో ఆరణి శ్రీనివాసులు

శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరిస్తాం

శెట్టిపల్లెకి చెందిన ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ బాలమునికృష్ణ నేతృత్వంలో 30 కుటుంబాలు జనసేనలో చేరాయి. అనంతరం ఆరణి శ్రీనివాసులు.. శెట్టిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, జనసేన ఎన్నికల గుర్తయిన గాజు గ్లాసుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. శెట్టిపల్లె భూ సమస్యపై పవన్ కల్యాణ్ దృష్టి సారించారని, ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు కాగానే కచ్చితంగా పరిష్కరిస్తామని ఆరణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.96 కోట్లు

తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ2.96 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 62,624 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,638 మంది తలనీలాలు సమర్పించారు.

ఆరణి విజయం కోసం..

30వ డివిజన్లో ఊకా విజయ్ కుమార్ ప్రచారం



గాజు గ్లాసు గుర్తుపై ఓటేయాలని కోరుతున్న ఊకా విజయ్‌కుమార్

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గాజు గ్లాసు గుర్తుపై వేసి గెలిపించాలని టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం 30వ డివిజన్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలో మైనార్టీలకు కేటాయించిన సంక్షేమ పథకాలను ఓటర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రఫీ, జాఫర్, ఖాజా, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

'బైండోవర్' వేధింపులు

- మాపై 120 కేసులు పెట్టారు
- వైసీపీ వారిపై కేవలం 42 మాత్రమే
- టీడీపీ, జనసేన నాయకుల ఆవేదన

తిరుపతి (నేరవిభాగం), మే 4: బైండోవర్ కేసుల పేరుతో తమపై వేధింపులు ఎక్కువయ్యాయని టీడీపీ, జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వారిపై 120 కేసులు పెడితే, వైసీపీ వారిపై కేవలం 42 కేసులే పెట్టారని విమర్శిస్తున్నారు. జిల్లాలో దాదాపు 753 బైండోవర్ కేసులు నమోదైతే తమ వారిపైనే 120 ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చంటున్నారు. తిరుపతి గిరిపురంలో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారం ఘటనలోనూ తిరుపతి పశ్చిమ పోలీసులు దాదాపు 17 మందిపై కేసులు నమోదు చేసినా.. టీడీపీ, జనసేన నాయకులను స్టేషన్‌కు పిలిపించి 'బైండోవర్' పేరుతో వేధిస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే కేసులో వైసీపీ కార్యకర్తలను ఇప్పటివరకు స్టేషన్‌కు పిలిపించిన దాఖలాల్లేవని విమర్శిస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే పోలీస్‌స్టేషన్ల ఎదుట నిరసన తెలుపుతామని జనసేన నాయకుడు కిరణ్ రాయల్ ఇప్పటికే హెచ్చరించారు.

సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు ర్యాండమైజేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 4: అదనపు సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు మొదటి ర్యాండమైజేషన్ చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య మేరకు అదనపు 2,566 సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు నేతల సమక్షంలో ర్యాండమైజేషన్ చేశామన్నారు. అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, జ్యోతి, డీఆర్వో పెంచల కిషోర్, అభ్యర్థులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో చంద్రగిరి టాప్

ఎర్రావారిపాలెం, మే 4: ఎన్నికల విధుల్లోని ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు దరఖాస్తు చేసుకోవడంలో జిల్లాలోనే చంద్రగిరి నియోజకవర్గం టాప్‌లో నిలిచింది. నియోజకవర్గాల వారీగా.. చంద్రగిరిలో 4,771 మంది, తిరుపతిలో 4,653 మంది, శ్రీకాళహస్తిలో 2,760 మంది, సత్యవేడులో 1,972 మంది, గూడూరులో 2,627 మంది, సూళ్లూరుపేటలో 2,051 మంది, వెంకటగిరిలో 2,443 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

వెంకన్న సేవలో కేంద్రమంత్రి



మహేంద్రనాథ్ పాండే

తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం కేంద్రమంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ బాగుండాలని, దేశంలో సుఖశాంతులు నెలకొనాలని స్వామిని ప్రార్థించినట్టు చెప్పారు.

తిరుపతి ప్రజల చేతిలో భూమనకు ఓటమి తప్పదు

- టీడీపీ నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ



మీడియాతో మాట్లాడుతున్న శంకరనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 4: రానున్న ఎన్నికల్లో తిరుపతి ప్రజల చేతిలో భూమనకు ఓటమి తప్పదని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ (చినబాబు) అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా భూమన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదనేది ఎన్నికల నిబంధన అన్నారు. విపరీతంగా నిధులు వెచ్చిస్తున్న వైసీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పత్రికల్లో పబ్లిసిటీలో వైసీపీ పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. ఎన్నిరకాల ఎత్తులేసినా తిరుపతిలో వైసీపీకి పరాజయం తప్పదని శంకరనారాయణ అన్నారు. ఈ సమావేశంలో వేణుగోపాల్, మనోజ్‌కుమార్, సబ్బరామయ్య, సునీల్, రమేష్‌కుమార్, కేశవనాయుడు పాల్గొన్నారు.

తిరుమలేశుడికి కానుకగా లారీ



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శనివారం ఓ లారీని కానుకగా అందింది. చెన్నైకి చెందిన అశోక్ లేలాండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రెసిడెంట్ సంజీవ్‌కుమార్ రూ.31.31 లక్షల విలువైన లారీని అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు నూతన వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెబుదాం





ప్రచారం నిర్వహిస్తున్న తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి - సమావేశంలో ప్రసంగిస్తున్న వరప్రసాద్

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 4: దళితులంటే వైసీపీకి చులకన భావమని ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. శనివారం తిరుపతి నగరంలోని జీవకోనలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఈ ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... తిరుపతిలో గత ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఎక్కడ అభివృద్ధి జరక్కపోయినా తన భర్త వరప్రసాద్ ప్రాతినిధ్యం వహించిన గూడూరు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. ప్రజలతో మమేకమవడం గమనించిన వైసీపీ పెద్దలు గ్రహించలేక కావాలనే తమ భర్తను అవమానపరిచారన్నారు. అటువంటి అవమానాలను ఐదేళ్ల ప్రజల కోసం భరించారని ఇక ఉండలేక బయటకువచ్చారని ఇటువంటి పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్ఫూర్తి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

హైలెవల్ కమిటీ సమావేశం...

స్థానికంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ ఢిల్లీ ఎలక్షన్ ఆర్గనైజేషన్ కమిటీ హైలెవల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి అరుణ్‌సింగ్, ముఖర్జీ, రాష్ట్రఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రప్పతో కలసి వరప్రసాద రావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ప్రతి కార్యకర్తా చిత్తశుద్ధితో పనిచేసి తిరుపతి ఎంపీ సీట్‌ను గెలిచేలా కూటమి పార్టీలను సమాయత్తం చేయాలని అందుకు నాయకులందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుమలలో అయోధ్యకాండ పారాయణం

తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణంలో కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం 10వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరగనుంది. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు జరగనున్న ఈకార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయోధ్యకాండలోని 35నుంచి 39వ సర్గల వరకు ఉన్న మొత్తం 164 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి 189 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీ వేదవిజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



ఇదీ మందుల

ఎన్నికల వేళ ఓటర్లందరూ ఆత్మీయులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు తిరుపతిలో పార్టీల నాయకులు. ఎవరినీ,ఏవర్గాన్నీ వదలకుండా మచ్చిక చేసుకుంటున్నారు. కులం కార్డును ఉపయోగించడానికీ వెనకాడ్డంలేదు. ఏ సామాజిక వర్గానికి ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో ఆరా తీస్తున్నారు. కులపెద్దలను పిలిపించుకుని ఎన్నడూ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. మీటింగులు పెడుతున్నారు. విందు భోజనాలు పెడుతూ ప్రసన్నం చేసుకుంటున్నారు. వరసలూ కలిపి ముచ్చటిస్తున్నారు. ఇదే మంచి అవకాశంగా భావించి కులసంఘ నాయకులు తమ సమస్యలు ఏకరవు పెడుతూ హామీలు పొందుతున్నారు. నాయకులు కూడా సాధ్యాసాధ్యాలు చూడకుండా మాటిచ్చేస్తున్నారు. ఆఖరుకు ఓబీసీలోనూ చేర్పిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. సామాజిక వర్గాలకే కాదు వర్గ కులకూ అడిగిందల్లా చేస్తామంటూ నమ్మిస్తున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

ముఖం చాటేస్తున్నారు...

అగ్రనేతలెవరూ ప్రచారానికి రావడంలేదంటూ నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు. ఒకపక్క అసంతృప్తుల బుజ్జగింపులో రోజా బిజీబిజీగా ఉండడం, పార్టీకి చెందిన పెద్దలెవరూ రాకపోవడంతో ఇదెక్కడి పరిస్థితి రా బాబూ అంటూ తెగ బాధపడిపోతున్నారు. నగరి నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తరఫున ప్రచార సభను మార్చిలోనే నిర్వహించారు. పీసీసీ చీఫ్ షర్మిల కూడా కాంగ్రెస్ పక్షాన పుత్తూరులో సభను నిర్వహించారు. వైసీపీ తరఫున మాత్రం ఇప్పటి వరకు ఆ పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఎవరూ ప్రచారపర్వంలో పాల్గొనకపోవడంపై ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో జగన్ పుత్తూరులో సభ నిర్వహించారు. ఈసారి మాత్రం పూతలపట్టు వచ్చిన జగన్ అక్కడే రోజాను ఆశీర్వదించాలని ప్రకటించి వెళ్లిపోయారు. అసలే నగరిలో రోజాకు పరిస్థితి అంత ఆశాజనకంగా లేదనే ప్రచారం నేపథ్యంలో ప్రత్యేకించి వైసీపీ టాప్ లీడర్ షిప్ దూరంగా ఉండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- పుత్తూరు అర్బన్



www.andhrajyothy.com

జన కేతనం



ఆదివారం 5 మే 2024



రోజా మేడం.. గుర్తుందా ఇది మీ శాఖే!

జగన్నాటకం పర్యాటకం

జగనన్న పాలనలో పర్యాటకం పడకేసింది. పైసా విదిల్చని ప్రభుత్వంలో పర్యాటకశాఖకు మంత్రి అయిన రోజా జిల్లా కోసం అంగుళం అభివృద్ధి పనికూడా చేయలేక చేతులెత్తేశారు. ప్రతిపక్షాల మీద నోరేసుకుని విరుచుకుపడిపోవడమే తప్ప, నిధులు ఇవ్వు జగనన్నా అని ఒక్కసారి కూడా అడిగి సాధించుకోలేకపోయారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సాధించిన ప్రగతి మినహా తిరుపతి జిల్లాకు చెప్పుకోవడానికి ఒక్కటి కూడా వైసీపీ ప్రభుత్వానికి లేదు. అయినా నిస్సిగ్గుగా మళ్లీ మరో ఛాన్స్ అడుగుతున్నారని జనం ఆశ్చర్యపోతున్నారు. పిచ్చి తుప్పల పాలైన జిల్లా పర్యాటకంపై ఆంధ్రజ్యోతి సచిత్ర కథనం...

- తిరుపతి ..తడ (ఆంధ్రజ్యోతి)



నేలపట్టులో పిచ్చిమొక్కల మధ్య శిథిలావస్థలో ఉన్న రిసార్ట్‌లు

నెరవేరని స్వదేశీ దర్శన్ కలలు!

కేంద్ర స్వదేశీ దర్శన్ కార్యక్రమం కింద 2017లో నేలపట్టులో రూ.5 కోట్లతో రిసార్టు, చిల్డ్రన్స్ పార్కు, పర్యాటకుల విడిది కోసం ఉడ్ హౌస్‌లు కట్టారు. 2019 నాటికి పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు వాటిని ప్రారంభించలేదు. ఇప్పుడు రిసార్టు పిచ్చిమొక్కల నడుమ అడవిని తలపిస్తుండగా ఉడ్ హౌస్ శిథిలావస్థకు చేరుతోంది. బీవీపాలెంలో ని నిర్మాణాల్లో పెండింగ్ పదిశాతం పనులు పూర్తిచేయడానికి వైసీపీ ప్రభుత్వానికి నాలుగున్నరేళ్ళు పట్టింది.

శిథిలావస్థకు తొలి అతిథి భవనం

జిల్లాలోని ఏకైక బీచ్‌గా గుర్తింపు పొందిన వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటకులు విడిది చేసేందుకు 1987లో టీడీపీ ప్రభుత్వం స్వర్ణముఖి అతిథి భవనం నిర్మించింది. ఐదేళ్లుగా పట్టించుకునేవాళ్లు లేక శిథిలావస్థకు చేరుకుంది.



తూపిలిపాలెం బీచ్‌లో శిథిలావస్థకు చేరిన స్వర్ణముఖి టూరిజం గెస్ట్ హౌస్.



నేలపట్టులో నిరుపయోగంగా వున్న పెలికాన్ గెస్ట్ హౌస్‌లు

పెలికాన్ గెస్ట్ హౌస్‌లు ఏమయ్యాయి?

దొరవారిసత్రం మండలం నేలపట్టులో 2001లో చంద్రబాబు ప్రభుత్వం రూ.37 లక్షలతో రెండు పెలికాన్ అతిథి గృహాలను నిర్మించింది. ఐదేళ్ళ పాటు విజయవంతంగా నడిచినా వైసీపీ ప్రభుత్వం ఈ అతిథి గృహాలను ఏమాత్రం పట్టించుకోలేదు.

అతీగతీ లేని టూరిజం స్టార్ హోటల్

2015లో తిరుపతిలో యాత్రికుల కోసం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు నాటి సీఎం చంద్రబాబు స్టార్ హోటల్ మంజూరు చేశారు. 2016లో రుయా ఆస్పత్రి ఎదురుగా రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఏడంతస్తులు, 103 గదులతో హోటల్ నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ఫినిషింగ్ పనులు కూడా చేపట్టలేదు.



తిరుపతిలో అసంపూర్తిగా వున్న టూరిజం స్టార్ హోటల్ భవనం.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏమైంది?



దొరవారిసత్రం మండలం నేలపట్టులో పులికాట్ సరస్సు, పక్షుల అభయారణ్యం నేపథ్యంలో నాటి సీఎం చంద్రబాబు 2000లో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభించారు. ఏటా మూడు రోజుల పాటు జరిగిన పక్షుల పండుగ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక 2020 నుంచీ ఆగిపోయింది. .

పున్నమి రెస్టారెంటు కథ కంచికి!

నేలపట్టులోనే రూ.98 లక్షలతో పున్నమి రెస్టారెంట్‌ను 2003లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూతపడినా 2014లో టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ మూతపడింది. తెరిపించేందుకు కనీస ప్రయత్నం జరగలేదు.

నేలపట్టులో నిరుపయోగంగా పున్నమి రెస్టారెంట్



బీవీపాళెం వద్ద నిర్మించిన రిసార్ట్‌లు



రోజా హయాంలో ప్రతిపాదనలకే పరిమితం

2022లో రోజా పర్యాటక శాఖ మంత్రి అయ్యాక రూపొందించిన ప్రతిపాదనలేవీ కార్యరూపం దాల్చలేదు. నవాబ్‌పేట, మొనపాలెం లైట్ హౌస్, తూపిలిపాలెం, శ్రీనివాసస త్రాలలో బీచ్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు, నివేదికలు కాగితాలకే పరిమితమయ్యాయి. వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద భారీ రిసార్టు, తలకోన, కళ్యాణి డ్యామ్‌ల వద్ద రిసార్టులు, రెస్టారెంట్లు ఏర్పాటు కాలేదు. రాయలచెరువు బోటింగ్‌కు కదలిక లేదు. తిరుచానూరు-పద్మావతీపురంలో మహిళా ప్రాంగణం పక్కన ఐదు ఎకరాలలో భారీ రిసార్టు, బార్, రెస్టారెంట్, పిల్లల వినోద వేదిక ఏర్పాటు ప్రతిపాదనకూ కదలిక లేదు.

ఒబరాయ్ హోటల్ పనులేవీ..

గతేడాది ఆగస్టులో సీఎం జగన్ కడప జిల్లా నుంచీ వర్చువల్‌గా తిరుపతి ఒబరాయ్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఒబరాయ్ హోటల్స్ గ్రూప్‌కు అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో 20 ఎకరాలు లీజుపై కేటాయించి తర్వాత పట్టించుకోలేదు.

నిధులు మురిగిపోయినా..

ఇరకం దీవిలో రిసార్టులు నిర్మించి బీవీ పాలెం నుంచీ స్పీడ్ బోట్లలో పర్యాటకులను దీవికి చేర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పటి నుంచీ నిధులు మురిగిపోతున్నా పర్యాటక మంత్రిగా రోజా కనీస చొరవ తీసుకోలేదు.

మంత్రి ఇలాకాలో మద్యం షాపు

2003లో టీడీపీ ప్రభుత్వం పుత్తూరులో పున్నమి రెస్టారెంట్ నిర్మించినా కాంగ్రెస్ హయాంలో మూత పడింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రోజా పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నా తెరిపించే ప్రయత్నం చేయలేదు. రెస్టారెంటును తెరిపించకపోగా అందులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహిస్తుండడం గమనార్హం.



పుత్తూరులో మూతపడిన టూరిజం రెస్టారెంటులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహణ

శ్రీకాళహస్తి పున్నమికి చీకట్లు


శ్రీకాళహస్తి పట్టణం మిట్ట కండ్రిగలో హరిత రెస్టారెంట్ 2019 వరకూ కళకళలాడింది. వైసీపీ ప్రభుత్వం రావడంతో నిర్వహణ లోపాలతో మూతపడే స్థితికి చేరుకుంది.



శ్రీకాళహస్తిలో మూసివేత దశకు చేరుకున్న టూరిజం రిసార్టు, రెస్టారెంట్

రాయలచెరువులో సాగని బోటు షికార్

2016లో టీడీపీ ప్రభుత్వం రామచంద్రాపురం మండలం రాయలచెరువులో బోటు షికారు ప్రారంభించింది. పది బోట్లు పర్యాటకులతో బిజీగా నడిచేవి. 2018లో నీరు తగ్గడంతో బోటు షికారుకు బ్రేక్ పడింది. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇది పూర్తిగా అటకెక్కింది.



పిక్నిక్ స్పాట్‌గా పేరొందిన రాయలచెరువు

చేనేత సిరి..వెంకటగిరి



● నియోజకవర్గం చరిత్ర

వెంకటగిరి రూరల్,డక్కిలి, బాలాయపల్లి,సైదాపురం, రాపూరు, కలువాయి, వెంకటగిరి మున్సిపాలిటీ

వెంకటగిరి అనగానే చేనేత, స్వాతంత్రం రాకముందు వెంకటగిరి రాజా పరిపాలన గుర్తుకు వస్తాయి. వెంకటగిరిలో నేటికీ రాజాలు ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనవాళ్ళు పురాతన భవన కట్టడాల రూపంలో కనిపిస్తాయి. ఇప్పటికీ ఇక్కడి రాజ వంశీకులు నాటి సాంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. చేనేతకు వెంకటగిరి పెట్టింది పేరు. అగ్గిపెట్టెలో పట్టేంత జరీచీరను నేసిన కళా నైపుణ్య చరిత్ర ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారైన చీరలు దేశ విదేశాల్లో ప్రాచుర్యం గడించాయి. రాజకీయల్లో కూడా ఈ నియోజకవర్గం ప్రత్యేక ముద్ర వేసుకుంది. ముఖ్యమంత్రితో పాటు పలు పదవులను అలంకరించిన నేదురుమల్లి జనార్దనరెడ్డి రాజకీయ జీవితం ప్రారంభమైంది ఇక్కడ నుంచే. నాటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజకవర్గం ఆవిర్భవించిన 72 ఏళ్లలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు తెలుగుదేశం అభ్యర్థులు, ఇండిపెండెంట్, వైసీపీలు ఒక్కోసారి విజయం సాధించాయి.

- వెంకటగిరి/డక్కిలి

ఎమ్మెల్యేలు

1952	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	కమతం షణ్ముగం (ద్విసభా నియోజకవర్గం)	కాంగ్రెస్
1962	అల్లం కృష్ణయ్య	కాంగ్రెస్
1967	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	ఇండిపెండెంట్
1972	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1978	నల్లపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపురెడ్డి చంద్రశేకరరెడ్డి	టీడీపీ
1985	వివి సాయికృష్ణయాచేంద్ర	టీడీపీ
1989	నేదురుమల్లి జనార్దనరెడ్డి	కాంగ్రెస్
1994	వివివి రాజగోపాలకృష్ణయాచేంద్ర	టీడీపీ
1999	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2004	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2009	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2014	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2019	ఆనం రామనారాయణరెడ్డి	వైసీపీ

నియోజకవర్గం ఏర్పడింది : 1952

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 15

ఓటర్లు

మొత్తం : 2,39,240
పురుషులు : 1,16,936
మహిళలు : 1,22,300
ఇతరులు : 04

ఆదరణ కోసం ఆ దరువు



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డప్పు కొడుతూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. తమ పార్టీ అభ్యర్థి మురళిని గెలిపించాలంటూ తిరుపతి లెనిన్ నగర్‌లో శనివారం ఆయన ఎన్నికల శంఖారావం పూరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది తమ పార్టీ ఒక్కటేనని రామకృష్ణ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

-తిరుపతి (ఆటోనగర్)

వీళ్లకి ఓటేస్తే ఏమి వస్తుంది?





ఇంటిపై కప్పిన ప్లాస్టిక్ టార్పాలిన్ - అస్లాం ఇంటి లోపలి పరిస్థితి

అదే మాఇల్లు. దగ్గర దగ్గర పదైదు అప్లికేషన్లు నేను ఇచ్చిండాను. ఇంటి కోసం తిరిగాను. ఏదేదో చేస్తే కూడా వైసీపీ గవర్నమెంటు నుంచి నాకు ఒగింత కూడా ఏమీ రాలేదు. మేము ఓటు వేసింది వైసీపీకే. ఇప్పుడు కూడా వైసీపీ వాళ్లు ఓటడిగేకి వస్తుండారు. వీళ్లకి ఓటేస్తే ఏం ప్రయోజనం. ఓటేస్తే మాకేమి వస్తుంది?

ఈ ప్రశ్న వేసింది వైసీపీ నాయకుడే. వైసీపీ రామకుప్పం మండలం ముస్లిం మైనారిటీ యువజన విభాగం అధ్యక్షుడు అస్లాం. రామకుప్పంలోని తన ఇంటి దుస్థితిని చూపిస్తూ ఆవేదనతో ఆయన చేసిన వీడియో వైరల్ అవుతోంది. - రామకుప్పం



● హామీల అమల్లో ఎమ్మెల్యే ఫెయిల్

నన్ను గెలిపిస్తే ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అన్న విధంగా పేరు తెచ్చుకుంటా.

- అలాగని 2019 ఎన్నికల ప్రచారం సందర్భంగా పలమనేరు ప్రజలకు పది హామీలిచ్చి మరీ వెంకటేగౌడ చెప్పారు. అదీ అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ముందే మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ఒక్కటీ నెరవేర్చలేదు. ఆ విషయంలో ఎమ్మెల్యేగా ఆయన ఫెయిలయ్యారు.

ఆయనేం చేస్తానన్నారంటే: పలమనేరును మాస్టర్ ప్లాన్ ద్వారా అభివృద్ధి చేస్తా. పట్టణాన్ని ఆనుకుని ఉన్న పెద్దచెరువులో మురుగునీరు చేరకుండా మళ్లిస్తా. ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇప్పిస్తా. టమోటా రైతులకోసం కోల్డుస్టోరేజి నిర్మిస్తా. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పిస్తా. మూడు దశాబ్దాలుగా ఉన్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా. పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తున్న పట్టురైతులకు కిలోకు రూ.50 ప్రోత్సాహకంగా ఇప్పిస్తా... పట్టురీలింగ్ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తా. బైరెడ్డిపల్లె వద్ద కైగల్ నది వద్ద రిజర్వాయర్ నిర్మిస్తా. హంద్రీనీవా నీటిని పలమనేరుకు తీసుకొచ్చి తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తా. పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద వైఎస్సార్‌జలాశయానికి అనుబంధంగా గంగన్న శిరస్సుప్రాజెక్టు నిర్మిస్తా. తద్వారా పలమనేరు ప్రజలకు తాగునీటి సమస్యే లేకుండా చేస్తా. - పలమనేరు

టెలిస్కోప్ / పూర్తి



పంటపొలాల్లో ఏనుగులు (ఫైల్‌ఫోటో)



ఏనుగుల దాడిలో నామరూపాలు లేకుండాపోయిన మామిడిచెట్టు(ఫైల్‌ఫోటో)

సీపీఎస్సా.. అదెంత సేపన్నా. అధికారంలోకి వస్తే వారంలో రద్దు చేసేస్తా.

- విపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న జగన్‌ను ఉద్యోగులు కలిసినప్పుడు ఇచ్చిన హామీ ఇది. ఇలా ప్రతిచోటా దాదాపు 150 సార్లు చెప్పి ఉంటారు.

సీపీఎస్ రద్దు చేయలేం. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుంది. అప్పుడు సరైన అవగాహన లేకుండా చెప్పాం. దానికన్నా మెరుగైన జీపీఎస్ తెస్తాం.

- సీపీఎస్ రద్దు హామీతో గంపగుత్తగా ఉద్యోగుల ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చాక సీఎం సహా వైసీపీ నేతలు మాట మడతేశారిలా. ఉద్యోగుల్ని మోసం చేశారు.

మాట తప్పేన మడమ తిప్పేన!





● చెప్పడమంటే.. చేయడమంటే!

● వారంలో సీపీఎస్ రద్దు హామీ.. అవగాహన లేక ఇచ్చారట

● జీపీఎస్ పేరుతో కంటితుడుపు చర్య ● జిల్లాలో 10,435 బాధిత ఉద్యోగులు

టీచర్లందరూ పిల్లలకు వారానికి ఏడు రోజులనే బోధించారు. కానీ, టీచర్లకు మాత్రం సీఎం జగన్ వారానికి ఎన్ని రోజులో చెప్పడం లేదు. సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చకుండా, వారమంటే నాలుగేళ్లో అయిదేళ్లో తేల్చకుండా టీచర్లకు, సీపీఎస్ ఉద్యోగులకు కొత్త పాఠాలు నేర్పిస్తున్నారు. హామీలు అమలు చేయకుంటే కాలర్ పట్టుకుని నిలదీయమని ప్రతిపక్ష నేతగా చెప్పిన జగన్.. సీఎం అయ్యాక అవగాహన లేకుండా సీపీఎస్ రద్దు హామీ ఇచ్చామని యూటర్న్ తీసుకున్నారు. ఓపీఎస్ అమలు చేయకపోవడంతో జిల్లాలో 10,435 మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. సీపీఎస్ రద్దు కోసం వీరంతా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అనేక రూపాల్లో నిరసనలు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన హామీని పక్కనపెట్టిన జగన్ సర్కారు.. ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని జీపీఎస్ అంటూ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఉద్యోగుల ఆందోళనల్ని తొక్కేయాలని శతవిధాలా ప్రయత్నించినా.. అరెస్టులు చేసినా.. ఉద్యోగులు ఇప్పటికీ ముక్తకంఠంతో నినదిస్తూనే ఉన్నారు.

అక్కడ రద్దు చేశారుగా?

ఓపీఎస్ పునరుద్ధరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతుందని.. ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిపోతుందని వైసీపీ ప్రభుత్వం కొత్త వాదన లేవనెత్తింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చలేమని, సీపీఎస్ రద్దు చేయడం కుదరదని చేతులెత్తేసింది. మరి అదే సమయంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు ఎలా రద్దు చేశాయి? కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా ప్రస్తుత ప్రభుత్వాలు సీపీఎస్ రద్దును ఎలా ప్రకటిస్తున్నాయి? అని ఇక్కడి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)

ఉద్యోగి పదవీ విరమణ చేశాక.. చివరి నెలలో ఉన్న వేతనంలో 50 శాతాన్ని సర్వీసు పెన్షన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఒకవేళ పెన్షన్‌దారుడు మరణిస్తే అతడి భార్య ఆ తర్వాత వారిపై ఆధారపడిన దివ్యాంగులైన, పెళ్లికాని పిల్లలకు పెన్షన్ ఇచ్చేవారు.

సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)

ఉద్యోగి చందా ఆధారిత స్కీమ్ కింద వారి బేసిక్ పే, డీఏ నుంచి ప్రతి నెలా 10 శాతం చొప్పున కట్ చేస్తారు. దానికి ప్రభుత్వం మరో 10 శాతం జత చేసి ఎన్‌పీఎస్-ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తుంది. సదరు ఉద్యోగి పదవీ విరమణ నాటికి రూ.10 లక్షలు ఖాతాలో ఉంటే.. ఆ మొత్తం నుంచి 60 శాతం (రూ.6 లక్షలు) రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద చెల్లిస్తారు. మరో 40 శాతం సొమ్మును షేర్ మార్కెట్‌లో కొనసాగిస్తూ.. వచ్చే లాభనష్టాలతో కలిపి ఎంతో కొంత ప్రతి నెలా పెన్షన్ రూపంలో చెల్లిస్తారు. ఇది సామాజిక పెన్షన్ కంటే తక్కువగా వస్తుంది.

జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా జీపీఎస్ విధానాన్ని తీసుకొస్తున్నామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. ఈ విధానంలో ఉద్యోగి రిటైర్‌మెంట్ అయ్యాక పెన్షన్‌కు పూర్తి గ్యారెంటీ అని అంకెల గారడీ చేసింది. ఈ లెక్కలన్నీ తప్పుల తడకలే అని ఉద్యోగులు అంటున్నారు. ఇందులో రిటైర్‌మెంట్ అయ్యాక ఎలాంటి బెనిఫిట్స్ ఉండవు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

తగిన మూల్యం చెల్లించక తప్పదు



వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానన్న సీఎం ఐదేళ్ల పూర్తయినా అమలు చేయకపోవడం అన్యాయం. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నా ఇక్కడ హామీ నిలబెట్టుకోకపోవడం దారుణం. సీపీఎస్ రద్దు చేస్తామంటే నమ్మి గత ఎన్నికల్లో ఆయన వెంట నడిచాం. ఇప్పుడు ఆయన తగిన మూల్యం చెల్లించక తప్పదు.

- హేమచంద్రారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, కార్వేటినగరం

జిల్లా కేంద్రం..

అమాత్యులేరీ?

● మీకు తెలుసా?

జిల్లా కేంద్రమైన చిత్తూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో ఒక్కరు కూడా మంత్రి కాలేదు. ఈ నియోజకవర్గంలో విజయం సాధించిన వారంతా రెండు సార్లకు మించి ఎమ్మెల్యేగా గెలవలేదు. వీరిలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మాత్రమే ఒకసారి ఇండిపెండెంట్‌గా, మూడుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మిగిలిన వారంతా తక్కువసార్లే విజయం సాధించినా.. వారిలో ఎవరికీ మంత్రిపదవి లభించలేదు. - చిత్తూరు

1999లో ఓటింగ్ యంత్రాలు

● నోట్ దిస్ పాయింట్



ఓటింగ్ యంత్రాలను తొలుత 1999 ఎన్నికల్లో గోవాలో వినియోగించారు. ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాట్లను ఏర్పాటు చేయాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వీటిని ఏర్పాటు చేశారు.

- చిత్తూరు కలెక్టరేట్

పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లు



ఓపీఎస్‌ను రద్దు చేయకపోగా, జీపీఎస్ విధానాన్ని తెచ్చారు. దాన్ని మేము వ్యతిరేకించాం. పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లు.. ప్రభుత్వ కాంట్రిబ్యూషన్‌తో పాటు మాది కూడా ఆపేసి ఆరు నెలలైంది. దీంతో మరింత నష్టం తప్పడం లేదు. నవంబరు నుంచి నా కాంట్రిబ్యూషన్ కట్ అవుతున్నా.. ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ జమ చేయడం లేదు. డీఏ ఆరియర్స్ కూడా రాలేదు.

- సమీర్, ఏపీ సీపీఎస్ ఈఏ సంఘం జిల్లా అధ్యక్షుడు

జీపీఎస్‌ను బలవంతంగా రుద్దుతున్నారు



సీపీఎస్ విధానంతో లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారు. అకాల మరణం పొందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలు మానసిక, ఆర్థిక సమస్యలు వర్ణనాతీతం. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోగా గ్యారెంటీ లేని పెన్షన్ స్కీమ్‌ను బలవంతంగా రుద్దడం అన్యాయం.

- గణేష్, సీపీఎస్ ఉపాధ్యాయుడు, పూతలపట్టు

ఉద్యోగులకు అండగా నిలవాలి



ప్రభుత్వ ఉద్యోగి, ఉపాధ్యాయుడు తన జీవితంలో యవ్వనం మొత్తం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తాడు. అలాంటి ఉద్యోగికి వద్ధాప్యంలో ప్రభుత్వం నుంచి ఆసరా అత్యవసరం. ఏ ప్రభుత్వ పథకం అందని ప్రభుత్వ ఉద్యోగికి శేష జీవితంలో నూతన పెన్షన్ విధానం ఏ మాత్రం ప్రయోజనకరం కాదు.

- అనిల్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగి, వి.కోట

అబద్ధం.. అంతా అబద్ధం

'పాలారు' కోసం పరిపాలనా అనుమతులతో జీవో ఇచ్చింది నిజం. ఆ జీవోలో నిధుల కేటాయింపు చేసిందీ వాస్తవమే. కాకుంటే ఇది జరిగింది ఫిబ్రవరి 23న. ప్రకటించింది 26న. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మార్చి 17న. అదే సమయంలో పాలారు వివాదం కోర్టులో ఉన్నదీ నిజమే. ఇలా సమయం, సందర్భాన్ని చూస్తే ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే అబద్ధపు హామీగా దీనిని చెప్పవచ్చు.

హంద్రీ నీవా గేట్లు ఎత్తింది నిజం. కొద్దిపాటి నీటిని వదిలిందీ వాస్తవమే. ఆపై కాలువ ఎండిందీ కళ్లకు కనిపించే సత్యం. కాకుంటే, కుప్పం నియోజకవర్గ ప్రజలకు నీటి సమస్యను తీర్చేశానన్నదే పెద్ద అబద్ధం. - కుప్పం

గణేశ్‌పురం పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం ఇదే (ఫైల్ ఫొటో)





తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా (ఫైల్ ఫొటో)

'పాలారు' నీళ్లు పారిస్తాం!

● కోర్టు పరిధిలోని అంశంపై పరిపాలనా అనుమతులు

● పదవీ కాలం చివర్లో జీవో జారీ

● పొరుగు రాష్ట్రాలతో అనవసర చిచ్చు

హంద్రీ నీవా ద్వారా కృష్ణా జలాలు తెచ్చేశాం. ఇక పాలారు ప్రాజెక్టు పెండింగులో ఉంది. దీనిన చిన్న రిజర్వాయరుగా 0.2 టీఎంసీ కెపాసిటీతో రూ.215 కోట్లతో నిర్మించేస్తాం. ఇప్పటికే మన ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చేసింది.

- ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ శాంతిపురం మండలంలో జరిగిన సభలో ఇచ్చిన హామీ ఇది.

పాలారు అనేది బహుళ ప్రాజెక్టుల నది. ఇది 1982లో కుదిరిన మద్రాసు-మైసూరు ఒప్పందంలో పేర్కొన్న అంతర్రాష్ట్ర నదులలో ఒకటి. 1892 నాటి అపస్ట్రీమ్ స్టేట్స్ అగ్రిమెంట్ ప్రకారం దిగువ రాష్ట్రాల ముందస్తు అనుమతి లేకుండా అంతర్రాష్ట్ర నదులపై డ్యామ్‌ల నిర్మాణం లేదా నీటిని మళ్లించడానికి, నిల్వ చేయడానికి ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఇప్పటికే న్యాయస్థానాలలో ఈ పాలారు ప్రాజెక్టు వివాదంపై ఆంధ్ర-తమిళనాడు మధ్య కేసు నడుస్తోంది.

- జగన్ ప్రకటన చూసిన తర్వాత అదే ఫిబ్రవరి 27వ తేదీన తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖమంత్రి దురై మురుగన్ చేసిన విస్పష్ట ప్రకటన ఇది.

హంద్రీనీవా మాయ!

ముందుగా చెప్పినట్లే హంద్రీనీవా కాలువను పూర్తి చేశాను. కృష్ణాజలాలను ఈ కాలువ ద్వారా తీసుకొచ్చి కుప్పం నియోజకవర్గం నీటి కష్టం తీర్చాను

- మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా ఇటీవల సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది.



రామకుప్పం సమీపంలో చుక్కనీళ్లు లేని హంద్రీ-నీవా కాలువ

నిజం: కుప్పం హంద్రీనీవా కాలువలో చుక్క నీళ్లు లేవు. సీఎం జగన్ చెప్పినట్లు కాలువలోకి నీటి విడుదల నాటకం ఆడారు కానీ, సక్సెస్ కాలేదు. కనీసం నాలుగైదు కిలోమీటర్ల మేర కూడా ఆ నీళ్లు ప్రవహించకుండానే ఎండిపోయాయి. కుప్పంలో కరువు విలయతాండవం చేస్తోంది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కొద్దిపాటి నీటిని తీసుకొచ్చి.. కాలువకు అడ్డంగా కట్టలు కట్టి.. నిల్వ చేసి.. సెటప్ చేసిన గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు నాటకం ఆడారు. ఒక రోజుకు నాటకాన్ని బాగానే రక్తి కట్టించినా.. మరునాటికల్లా బండారం బయటపడిపోయింది. హంద్రీనీవా కాలువకు నీటి విడుదల అనేది జగన్నాటకమని లోకమంతా స్పష్టంగా తెలిసినా సరే, జగన్ ఒప్పుకోవడంలేదు. అందుకే.. మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసి హామీని నెరవేర్చినట్లు అబద్ధం అలవోకగా చెప్పేశారు. **కుప్పం**

ఈ రెండు ప్రకటనలను గమనించినవారికి ఎవరికైనా పాలారు ప్రాజెక్టు నిర్మాణంపై జగన్ అబద్ధపు ప్రకటన చేశారని ఇట్టే అర్థమైపోతుంది. ఆయన ప్రభుత్వం పరిపాలనా అనుమతులు అదే ఫిబ్రవరి నెల 23వ తేదీన విడుదల చేసింది నిజమే. అదే ఫిబ్రవరి నెల 29వ తేదీన సంబంధిత జీవోను ప్రభుత్వం బహిరంగ పరిచింది కూడా. కానీ కోర్టులో వివాదం నడుస్తున్నప్పుడు ఒక రాష్ట్ర ప్రభుత్వం పొరుగు రాష్ట్రాన్ని కనీసం సంప్రదించకుండా ఇలా ఏకపక్షంగా అనుమతులు ఎలా మంజూరు చేసిందన్నది ప్రశ్న. ఇలా అబద్ధపు హామీ ఇవ్వడమేకాక, దీనిని సమర్థించుకోవడానికి ఇలా చెల్లని జీవోలు విడుదల చేయడం కూడా జగన్‌కే చెల్లింది. మొత్తం రూ.214,81,00,000 గణేశ్‌పురం వద్ద పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇస్తున్న జీవోలో ఏ పనికి ఎంతెంత నిధులు కేటాయిస్తున్నది కూడా స్పష్టంగా పేర్కొన్నారు. ఈ జీవో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో తమిళనాడు రాష్ట్రం భగ్గుమంది. తిరుపత్తూరు కలెక్టరేట్ ఎదుట రైతులు, పాలారు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మార్చి 1న ధర్నాకు దిగారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలను ఇటువంటి హామీలు, ఉత్తుత్తి ప్రారంభోత్సవాలతో మభ్యపెట్టడం జగన్‌కు కొత్తకాదు. కాకుంటే పాలారు విషయం పక్క రాష్ట్రాలకు సంబంధించింది. దీంతో ఈ అంశం అంతర్రాష్ట్ర వివాదంగా మారిందంతే.

ఇదీ పాలారు కథ

కర్ణాటకలో ప్రారంభమయ్యే పాలారు నది, ఏపీ మీదుగా తమిళనాడుకు ప్రవహిస్తుంది. వర్షాకాలమప్పుడే జలాలు కనిపిస్తాయి. ఈ సమయంలో నీటిని నిల్వ ఉంచుకోవడానికి 2007లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కుప్పం మండలం గణేశ్‌పురం వద్ద పాలారునదిపై రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టు గుమ్మం తొక్కింది. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. దీంతో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేయలేదు.

ఇదంతా కుప్పం ప్రజలమీద ప్రేమేనా?:

ఇవన్నీ తెలిసినా సీఎం జగన్ ఈ జీవో ఎందుకు ఇచ్చినట్లు? ఇది అందరికీ వచ్చే ప్రశ్న. దీనికి జవాబు ఎన్నికల ముందు కుప్పం ప్రజలను మభ్యపెట్టడమే. పాలారు ప్రాజెక్టుతో తాను ప్రజలను ఉద్ధరిస్తున్నట్లు అనిపించాలి. మళ్లీ ఆ నిర్మాణంపై తాను ఇచ్చిన హామీ అమలు కాకుండా అడ్డుకుంటున్నదని నెపాన్ని తమిళనాడుపై తోసేయాలి. ఇరుగుపొరుగుగా ఉండి ఒకరితో ఒకరుగా సంబంధబాంధవ్యాలు కలిగివున్న ఇరు రాష్ట్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలి. తాను మాత్రం అపర భగీరథుడిగా పేరు కొట్టేయాలి. ఈమధ్యలో కుప్పం ఓట్లు కొల్లగొట్టాలి. ఈ ప్లాన్‌తోనే పాలారు నాటకం ఆడారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, మే 4: ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఆదివారం, సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 2760 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజులు పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సమయం నిర్దేశించారు. శనివారం రాత్రి అధికారుల బృందం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. భారీ బందోబస్తు నియమించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు యధాతథం

కేవీబీపురం, మే 4: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఓటరు జాబితాల్లో తప్పులు యధాతథంగా ఉన్నాయని సర్పంచు దొరబాబునాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే దొంగ ఓట్ల గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దొంగ ఓట్లను తొలగిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారని, అయితే నోటిఫికేషన్ విడుదలయ్యాక కూడా జాబితాల్లో తప్పులు అలాగే ఉన్నాయని, సచివాలయ సిబ్బంది ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి దొంగ ఓట్లను రద్దు చేయాలని దొరబాబునాయుడు కోరారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి



ప్రచారం చేస్తున్న చింతా మోహన్

వరదయ్యపాళెం, మే 4: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపీగా తనను గెలిపించాలని డాక్టర్ చింతా మోహన్ ప్రజలను కోరారు. వరదయ్యపాళెం చెంగాళమ్మ ఆలయం నుంచి ట్రంకు రోడ్డు వరకు శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. ఎంపీగా తనను, సత్యవేడు ఎమ్మెల్యేగా బాలగురవం బాబును గెలిపించాలని కోరారు.

బీజేపీతో దేశానికి ఒరిగిందేమీ లేదు

సత్యవేడు, మే 4: బీజేపీతో దేశానికి ఒరిగిందేమి లేదని చింతామోహన్ పేర్కొన్నారు. సత్యవేడులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ వద్ద మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల మోదీ పాలనలో అదానీని ప్రపంచంలోనే అత్యంత కుబేరునిగా చేయడం తప్ప దేశాభివృద్ధికి చేసిందేమి లేదని విమర్శించారు.

పోస్టల్ బ్యాలెట్‌లో చంద్రగిరి టాప్

ఎర్రావారిపాలెం, మే 4: ఎన్నికల విధుల్లోని ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు దరఖాస్తు చేసుకోవడంలో జిల్లాలోనే చంద్రగిరి నియోజకవర్గం టాప్‌లో నిలిచింది. నియోజకవర్గాల వారీగా.. చంద్రగిరిలో 4,771 మంది, తిరుపతిలో 4,653 మంది, శ్రీకాళహస్తిలో 2,760 మంది, సత్యవేడులో 1,972 మంది, గూడూరులో 2,627 మంది, సూళ్లూరుపేటలో 2,051 మంది, వెంకటగిరిలో 2,443 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయనున్నారు.

తిరుమలేశుడికి కానుకగా లారీ



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శనివారం ఓ లారీని కానుకగా అందింది. చెన్నైకి చెందిన అశోక్ లేలాండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రెసిడెంట్ సంజీవ్‌కుమార్ రూ.31.31 లక్షల విలువైన లారీని అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు నూతన వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు ర్యాండమైజేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 4: అదనపు సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు మొదటి ర్యాండమైజేషన్ చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య మేరకు అదనపు 2,566 సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్లకు నేతల సమక్షంలో ర్యాండమైజేషన్ చేశామన్నారు. అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, జ్యోతి, డీఆర్వో పెంచల కిషోర్, అభ్యర్థులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, మే 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ముందుగా అర్చకులు శనీశ్వర స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైసీపీ కబ్జా భూమిని పేదలకు పంచుతా: సుధీర్‌రెడ్డి



మాజీ ఎంపీటీసీ ధర్మరాజు సోదరులకు టీడీపీ కండువా కప్పుతున్న సుధీర్‌రెడ్డి

రేణిగుంట, మే 4: రేణిగుంట మండలంలో వైసీపీ నేతలు చేసిన కబ్జా భూములను స్వాధీనం చేసుకుని స్థానిక పేద ప్రజలకు పంచి పెడుతామని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రేణిగుంట మండల పరిధిలోని ఎల్లమండ్యం, తొండ్లం గ్రామాల్లో కూటమి సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్‌కు ఓటువేస్తే తమకు తెలిసిపోతుందని, తరువాత మీ సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని వైసీపీ నాయకులు ఇటీవల దళితవాడల్లో సామాన్య ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఇలాంటి విషయాలు ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఓటు ఎవరికి వేసినా తెలియదన్నారు. వైసీపీ ఎన్ని కుతంత్రాలు పన్నినా ఎన్‌డీఏ కూటమిని గెలిపించడానికి ప్రజలు నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, సీనియర్ నాయకుడు మునస్వామినాయుడు, చిన్నారెడ్డి, బుజ్జినాయుడు, శేషాద్రి, పాడి రాజేంద్ర, నాదమునిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లీలావతి, నాగమునిరెడ్డి, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ ధర్మరాజులు, ఆయన సోదరుడు శ్రీనివాసులు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, పులిగోరు మురళి, మెహబూబ్‌బాషా, పుష్పనాథన్, మునీర్, నవాబు, రవి, కన్నన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని 19 వార్డులో బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తన భర్త బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని కోబాక, మేర్లపాక దళితవాడల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృదమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళితుల అభ్యున్నతికి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎనలేని కృషి చేశారని చెప్పారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూనియాడు, గౌరమ్మ, విజయశేఖర్‌నాయుడు, రమణారెడ్డి, కుక్క రమణయ్యయాదవ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో బొజ్జల రిషిత రెడ్డి

వైసీపీకి గుణపాఠం చెబుదాం





ప్రచారం నిర్వహిస్తున్న తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి - సమావేశంలో ప్రసంగిస్తున్న వరప్రసాద్

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 4: దళితులంటే వైసీపీకి చులకన భావమని ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. శనివారం తిరుపతి నగరంలోని జీవకోనలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఈ ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... తిరుపతిలో గత ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఎక్కడ అభివృద్ధి జరక్కపోయినా తన భర్త వరప్రసాద్ ప్రాతినిధ్యం వహించిన గూడూరు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. ప్రజలతో మమేకమవడం గమనించిన వైసీపీ పెద్దలు గ్రహించలేకకావాలనే తమ భర్తను అవమానపరిచారన్నారు. అటువంటి అవమానాలను ఐదేళ్ల ప్రజల కోసం భరించారని ఇక ఉండలేక బయటకువచ్చారని ఇటువంటి పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్ఫూర్తి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

హైలెవల్ కమిటీ సమావేశం...

స్థానికంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ ఢిల్లీ ఎలక్షన్ ఆర్గనైజేషన్ కమిటీ హైలెవల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి అరుణ్‌సింగ్, ముఖర్జీ, రాష్ట్రఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రప్పతో కలసి వరప్రసాద రావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ప్రతి కార్యకర్తా చిత్తశుద్ధితో పనిచేసి తిరుపతి ఎంపీ సీట్‌ను గెలిచేలా కూటమి పార్టీలను సమాయత్తం చేయాలని అందుకు నాయకులందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాపు తొలగిస్తే ఆత్మహత్యే శరణ్యం



బాలగురవయ్య కుటుంబసభ్యులు

ఏర్పేడు, మే 4: తమ కుటుంబానికి జీవనాధారమైన దుకాణాన్ని తొలగిస్తే ఆత్మహత్యే శరణ్యమని ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామానికి చెందిన బాలగరవయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఓ వీడియో విడుదల చేశారు. సీతారాంపేట వద్ద రోడ్డు పక్కన తాను ఓ చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, రెండు రోజుల నుంచి కొంతమంది వైసీపీ నాయకులు తమ దుకాణాన్ని కూలదోయడానికి ప్రయత్నం చేస్తున్నారని విలపించారు. దుకాణం కూలదోస్తే తమ కుటుంబం రోడ్డున పడుతుందని, అధికారులు స్పందించి తనకు న్యాయయం చేయాలని వేడుకున్నాడు. ఇదిలా ఉండగా, సీతారాంపేట గ్రామపెద్దలు ఓ వీడియో విడుదల చేశారు. గ్రామంలోని రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంత మంది దుకాణాలు నిర్మించుకున్నారని తెలిపారు. ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మించి, వచ్చే ఆదాయాన్ని గుడికి వాడుకోవాలని నిర్ణయించామని, ఆ విషయాన్ని దుకాణదారులకు తెలియజేసినట్లు వీడియోలో చెప్పారు.

రెండు వర్గాల ఘర్షణ: నలుగురిపై కేసు

ఏర్పేడు, మే 4: మోదుగులపాళెం గ్రామంలో రాజేష్, శ్రీనివాసులు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. శుక్రవారం సాయత్రం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. రాజేష్ ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, హరి, కృష్ణయ్య, నాగరాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

రేణిగుంట, మే 4: టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ సర్పంచు జ్యోతినారాయణరెడ్డి, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, కన్నయ్య, శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వలంటీర్ల రాజీనామా

వరదయ్యపాళెం, మే 4: వరదయ్యపాళెం మండలంలోని కారిపాకం, వరదయ్యపాళెం కదూరు, మరదబాడ పంచాయతీల పరిధిలోని 21మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.96 కోట్లు

తిరుమల, మే 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.96 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ప్రకటించింది.

జగన్‌ను సాగనంపకుంటే రాష్ట్రం వల్లకాడే: ఆదిమూలం



నగదును అందజేస్తున్న గిరిజనులు, దివ్యాంగులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే: 5 త్వరలో జరిగే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి సాగనంపకపోతే రాష్ట్రం వల్లకాడుగా మారుతుందని ఎన్‌డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని తిమ్మాభూపాలపుం, పార్లపల్లి, కొత్తపాళెం, కాటూరు, వీఎస్‌పురం, పెద్దపాలేడు, చిన్నాయ్యగుంట, జీఎన్‌కండ్రిగ, ఆర్ అనంతపురం, భానీశంశరపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పల్లమాల పంచాయతీలోని పచ్చాలమ్మ గిరిజన కాలనీ గిరిజన మహిళలు, దివ్యాంగులు ఆదిమూలానికి నగదు విరాళంగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్యనాయుడు, సుముద్రాల సుధాకర్‌నాయుడు, బట్టా రమేష్‌యాదవ్ వెంకటచలం, మధునాయుడు, శ్రీనివాసులు, సుందరయ్య, భూపయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు హరిబాబురెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో వర్షం... ఇబ్బంది పడిన భక్తులు



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కూడా వర్షం కురిసింది. గురు, శుక్రవారాల తరహాలో శనివారం కూడా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు వరకు భారీ వర్షం పడటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కమ్మేశాయి. గంట పాటు వానపడి ఆగిపోయింది. శ్రీవారి ఆలయం ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, పార్కులు, రోడ్డు తడిచిముద్దయ్యాయి. సాయంత్రానికి తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోవడంతో భక్తులు ఉపశమనం పొందారు.

పుత్తూరు వార్తలు

ఆట మొదలైంది

- ముఖ్య నాయకులను కోల్పోయిన వైసీపీ
- గందరగోళంలో కేడర్
- పక్క చూపులు చూస్తున్న చోటా నేతలు
- నేడు విజయపురంలో కీలక సమావేశం

పుత్తూరు అర్బన్, మే 4: నగరిలో ఆట మొదలైంది... పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ ఫ్యాన్ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒక్కొక్కరుగా ముఖ్య నాయకులను కోల్పోతుండడంతో ఆ పార్టీ కేడర్ గందరగోళంలో పడింది. ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై స్పష్టం కానుండడంతో చోటా నాయకులు పక్క చూపులు చూస్తున్నారు. వీరిని గోడ దూకకుండా ఆపేందుకు మంత్రి రోజా క్యాంప్ పడరాని పాట్లు పడాల్సి వస్తోందనే మాటలు వినబడుతున్నాయి. మరోవైపు వైసీపీకి గుడ్‌బై చెప్పిన మంత్రి రోజా వ్యతిరేకవర్గం ఆదివారం మధ్యాహ్నం విజయపురం మండలంలోని నెహ్రూనగర్‌లోని లక్ష్మీపతిరాజు నివాసంలో కీలక సమావేశం నిర్వహించనుంది. నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. పలువురు మండల స్థాయి నాయకులు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం నుంచే మంత్రి రోజాను ఓడించేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు.

భీష్మ ప్రతిజ్ఞ

రాజకీయంగా తమ ఉనికిని ప్రశ్నార్థంకంగా మార్చిన మంత్రి రోజాను ఓడించి తీరుతామని అసమ్మతి నాయకులు గతంలోనే భీష్మ ప్రతిజ్ఞ చేశారు. దీంతో ఒక్కొక్కరుగా వైసీపీ నుంచి బయటకు రావడం మొదలైంది. తొలుత పుత్తూరు మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై పార్టీని వీడగా, శుక్రవారం శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు రాజీనామాలు సమర్పించారు. కీలక నాయకులు ఒక్కొక్కరు పార్టీని వీడుతుండడంతో ఆ పార్టీ కేడర్ అయోమయానికి గువుతోంది. ఎన్నికల తరువాత పరిణామాలను బేరీజు వేసుకుంటూ పక్క చూపులు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే గాలి భానుప్రకాష్ నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం టీడీపీ నాయకులను సంప్రదించడం కనిపిస్తోంది. వరుస పరిణామాలు వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

వేదికకానున్న విజయపురం

2019 ఎన్నికల ముందు జనవరిలో విజయపురం మండలంలోని లక్ష్మీపతిరాజు గృహంలో వైసీపీ నాయకుల కీలక సమావేశం జరిగింది. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రోజాతో నియోజకవర్గానికి చెందిన నాయకులు రెడ్డివారి చక్రపాణి రెడ్డి, డీఎన్ ఏలుమలై, రవిశేఖర్‌రాజు మధ్య ఉన్న మనస్పర్థలు తొలగించుకుని ఎన్నికల్లో తలపడేందుకు లక్ష్మీపతి రాజు దౌత్యం జరిపారు. ఐదేళ్ల తరువాత సరిగ్గా అక్కడే రోజాను ఓడించేందుకు ఆమె వ్యతిరేకవర్గం నాయకులు, సమావేశం కానున్నారు. ఈపరిణామం నగరి రాజకీయాల్లో కీలకం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒడిసిపట్టుకున్న భానుప్రకాష్

వైసీపీలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో గాలి భానుప్రకాష్ పూర్తిస్థాయిలో సఫలీకృతులయ్యారనే మాటలు వినబడుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో ఈ దఫా గెలుపు కోసం కసి మీదున్న కేడర్‌ను ఎన్నికల రణరంగానికి సంసిద్ధం చేసుకున్న ఆయన వైసీపీని రాజకీయంగా కోలుకోలేని దెబ్బ కొట్టేందుకు స్కెచ్‌గీశారు. ఇందులో భాగంగా రోజాపై అసంతృప్తితో ఉన్న నాయకులను తనవైపుకు తిప్పుకునేందుకు పావులు కదిపారు. ఈ క్రమంలో భానుప్రకాష్ వేసిన రాజకీయ ఎత్తుగడలు వైసీపీకి శరాఘాతంగా పరిణమించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మీలో ఒకడిగా ఆదరించి గెలిపించండి: భానుప్రకాష్



వడమాలపేటలో మాట్లాడుతున్న భానుప్రకాష్

వడమాలపేట, మే 4: నిస్వార్థంగా సేవలందించిన ముద్దుకృష్ణ మనాయుడు బిడ్డగా మీ ముందుకు వచ్చా, నేను మీలో ఒకడిని, ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించండి.. మీ సేవకుడిలా సంక్షేమ పాలన అందిస్తానని ఎన్డీఏ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం వడమాలపేట, కదిరిమంగళం, ఓబీఆర్ కండ్రిగ, ఎస్‌బీపురం సాయంత్రం చింతకాల్వ, పత్తిపుత్తూరు అప్పలాయగుంట, బాలినాయుడు కండ్రిగ, సీతారామపురం, బట్టీకండ్రిగ, ఏఎం పురం, పూడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కోట్లకు పడగలెత్తిన మంత్రి రోజా కుటుంబాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని చక్కదిద్దే సమర్థత కలిగిన చంద్రబాబు నాయుడిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం అందరూ సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



టీడీపీలో చేరిన ఆటో కార్మికులతో భానుప్రకాష్

టీడీపీలో చేరిన ఆటో కార్మికులు

పుత్తూరు అర్బన్, మే 4: పట్టణ పరిధిలోని పలువురు ఆటో కార్మికులు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి గాలి భానుప్రకాష్ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు పాల్గొన్నారు.